PCW
తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd
Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna
హైదరాబాద్ సంపుటి : 01 సంచిక - 357 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 07 రూ - 03/- శనివారం 21 డిసెంబర్ 2024

## హైకోర్టులో కేటీఆర్‌కు స్వల్ప ఊరట




## అక్కడ అంబేడ్కర్‌కు.. ఇక్కడ స్పీకర్‌కు అవమానం






# రాష్ట్రపతి నిలయంలో ‘ఎట్ హోం’

### హాజరైన గవర్నర్ వర్మ, సీఎం రేవంత్, మంత్రులు

**హైదరాబాద్,డిసెంబర్ 20(పిసిడబ్ల్యూ న్యూస్):** శీతాకాల విడిది కోసం హైదరాబాద్‌కు వచ్చిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుక్రవారం సాయంత్రం బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో ఎట్‌హోం కార్యక్రమం నిర్వహించారు. ఈ తేనీటి విందుకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, తెలంగాణ శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, పలువురు మంత్రులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి వచ్చిన ప్రముఖులందరినీ రాష్ట్రపతి ముర్ము ఆప్యాయంగా పలకరించారు.



# ధరణి దోపిడికి భూ భారతితో చెక్: రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,డిసెంబర్ 20(పిసిడబ్ల్యూ న్యూస్):** అసలు ధరణిని ముందు కనిపెట్టింది కేసీఆర్ కాదని, 2010లోనే ఒరిస్సాలో ఈ–ధరణి తీసుకొచ్చారని తెలిపారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. బీఆర్ఎస్ సభ్యులు సభలో చర్చను పక్కదారి పట్టించేలా చూస్తున్నారని ఆరోపించారు. అసెంబ్లీలో నేడు జరిగిన భూ భారతి బిల్లు చర్చలో ఆయన మాట్లాడుతూ.. సభా మర్యాదలకు ఉల్లంఘన కలిగించి సభాపతి పైనే దాడి చేస్తామన్న ధోరణిలో బిఆర్ఎస్ సభ్యులు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మర్యాద లేకుండా స్పీకర్‌పైనే పేపర్లు విసిరేశారని మండిపడ్డారు. చర్యలు తీసుకునే పరిస్థితులు వచ్చినా స్పీకర్ ఓపికతో వ్యవహరించారని అన్నారు. భూముల కోసం ఎంతో మంది యోధులు త్యాగాలు చేశారు. అధికారం, అహంకారంతో కొంతమంది ఆధిపత్యం కోసం దాడులు చేశారు. భూమి కోసం, భుక్తి కోసం సాయుధ పోరాటం చేశారని గుర్తుచేశారు. భూమి కోసం సకల జనులు పోరాడిన సందర్భాలు ఉన్నాయన్నారు. చట్టాలతో యజమానుల హక్కులను కాపాడుకుంటూ వస్తున్నట్లు ప్రకటించారు. ల్యాండ్ సీలింగ్ యాక్ట్‌ను పీవీ నరసింహా రావు తీసుకొచ్చారన్నారు. ఇందిరా హయాంలో అసైన్‌మెంట్ భూముల పంపిణీ జరిగిందని వివరించారు. యూపీఏ హయాంలోనే భూభారతి పేరుతో దేశవ్యాప్తంగా సంస్కరణలకు శ్రీకారం చుట్టినట్లు గుర్తుచేశారు. నిజామాబాద్‌లో పైలెట్ ప్రాజెక్ట్ శ్రీకారం చుట్టారని సీఎం అన్నారు. తెలంగాణలో ప్రతి సమస్య భూమితోనే ముడిపడి ఉందని.. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని నిలబెట్టేది కూడా భూమి అన్నారు.కానీ గత ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణి మాత్రం రైతులను వారి భూములకు దూరం చేసిందన్నారు. ధరణి వెబ్ సైట్ అందుబాటులోకి వచ్చాక అనేక అక్రమాలు జరిగాయి అన్నారు. ఆర్థిక నేరాలకు పాల్పడే దేశాల్లోని సంస్థ చేతికి ధరణి పోర్టల్ నిర్వహణను అప్పగించారని అన్నారు సీఎం రేవంత్. ఫిలిప్పీన్స్, సింగపూర్, కెమెన్ హైలాండ్స్, వర్జిన్ హైలాండ్స్ వంటి దేశాలకు రైతుల సమాచారం వెళ్లిందని తెలిపారు. వివరాలు 2లో

## అసెంబ్లీలో గందరగోళ వాతావరణం

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై వాటర్ బాటిళ్లు విసిరారని ఆరోపణ




# హరియాణా మాజీ సీఎం ఓం ప్రకాశ్ చౌతాలా కన్నుమూత

- తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ప్రధాని నరేంద్ర మోదీ

**హరియాణా,డిసెంబర్ 20(పిసిడబ్ల్యూ న్యూస్):** ఇండియన్ నేషనల్ లోక్ దళ్ అధ్యక్షుడు, హరియాణా మాజీ ముఖ్యమంత్రి ఓం ప్రకాశ్ చౌతాలా (89) శుక్రవారం కన్నుమూశారు. గురువారం రాత్రి ఆయనకు గుండె పోటురాగా, ఆయనను వెంటనే ఆసుపత్రికి తరలించినప్పటికీ ఆయనను వైద్యులు రక్షించలేకపోయారని పార్టీ అధికార ప్రతినిధి తెలిపారు.మాజీ ఉపప్రధాని దేవీలాల్ కుమారుడైన ఓం ప్రకాశ్ చౌతాలా హరియాణాకు ఐదు సార్లు (1989 నుంచి 2005 వరకు) ముఖ్యమంత్రిగా పనిచేశారు. హరియాణా మాజీ ముఖ్యమంత్రి ఓం ప్రకాశ్



చౌతాలా మృతి పట్ల ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాపం తెలిపారు. “చౌతాలా చాలా ఏళ్లుగా రాష్ట్ర రాజకీయాల్లో చురుగ్గా పని చేశారు. తన తండ్రి దేవీ లాల్ పనులను వివరాలు 2లో

# ఫార్ములా-ఈరేస్ కేసులో అణాపైసా అవినీతి జరగలేదు

- న్యాయపరంగానే అన్నీ ఎదుర్కొంటాం : కేటీఆర్

**హైదరాబాద్,డిసెంబర్ 20(పిసిడబ్ల్యూ న్యూస్):** ఫార్ములా–ఈ రేస్ కేసులో అణాపైసా అవినీతి లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాటలతో ఈ కేసులో అవినీతి లేదని తేలిందన్నారు. ప్రొసీజర్ కరెక్ట్‌గా లేదని మాత్రమే అన్నారని చెప్పారు. ప్రభుత్వం కేసుపై ముందుకు వెళ్తే న్యాయపరంగా ఎదుర్కొంటామని చెప్పారు. హెచ్ఎండీఏ ఒక కార్పొరేషన్ అని, హైదరాబాద్ నగర ప్రగతికి పనికి వచ్చే ఏ కార్యక్రమానికైన డబ్బులు ఖర్చు చేయవచ్చని తెలిపారు. హెచ్ఎండీఏ చేసే ప్రతి పనికి ప్రభుత్వ అనుమతి అవసరం లేదని చట్టంలోనే ఉందన్నారు. దానికి



ఆ మేరకు స్వతంత్రత ఉందని చెప్పారు. అసెంబ్లీ ప్రాంగణంలో మీడియాతో కేటీఆర్ చిట్‌చాట్ చేశారు. ఫార్ములా–ఈ కార్ రేస్ కేసులో కొందరు తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. సీఎంను ఎవరో తప్పుదోవ పట్టిస్తున్నారా లేదా ముఖ్యమంత్రే అందరినీ తప్పుదోవ వివరాలు 2లో

# ఫార్ములా ఈ- రేసులో అక్రమాలు జరిగిన మాట వాస్తవమే

- అక్రమాలు జరిగినట్టు పలు ఆధారాలున్నాయి
- తనకు తానే సర్టిఫికేట్ ఇచ్చుకోవడం హాస్యాస్పదం
- కేటీఆర్ పై టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ విమర్శలు



**హైదరాబాద్,డిసెంబర్ 20(పిసిడబ్ల్యూ న్యూస్):** ఫార్ములా ఈ–రేస్ కేసులో తాను కడిగిన ముత్యమంటూ కేటీఆర్ తనకు తానే సర్టిఫికెట్ ఇచ్చుకోవడంపై రియాక్ట్ అయ్యారు టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్. ఫార్ములా ఈ– రేసులో అక్రమాలు జరిగిన మాట వాస్తవమేనన్నారు. అక్రమాలు జరిగినట్టు పలు ఆధారాలున్నాయన్నారు. తనకు తానే కేటీఆర్ సర్టిఫికేట్ ఇచ్చుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రభుత్వం పంపిన ఆధారాలపై గవర్నర్ న్యాయసలహా తీసుకొని కేసుకు అనుమతించాక అక్రమ కేసు ఎలా అవుతుందని సూటిగా ప్రశ్నించారు. చట్టపరంగా కేసు నమోదు అయినందున కోర్టులో తేల్చుకోవాలని సూచన చేశారు. శుక్రవారం అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో మండలి మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. ఈ–రేస్‌లో హెచ్ఎండీఏ భాగస్వామ్యం కాకపోయినా విదేశీ సంస్థకు ఆనాడు 55 కోట్ల నిధులు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. అంతేకాదు మూడేళ్ల పాటు రేసింగ్ జరిగేలా 600 కోట్లతో ఒప్పందం జరగలేదా? అంటూ ప్రశ్నల మీద ప్రశ్నలు సంధించారు. ఫార్ములా ఈ రేస్ వల్ల హైదరాబాద్ ప్రతిష్ట ఏ మాత్రం పెరగలేదన్నారు. ప్రజలను ఇబ్బంది పెట్టి ట్రాఫిక్ జాములు చేసి ఫార్ములా ఈ రేసింగ్ నిర్వహించారని మండిపడ్డారు. ఆధారాలు కనిపిస్తున్నా అక్రమాలకు పాల్పడలేదని కేటీఆర్ బుకాయించడాన్ని తప్పుబట్టారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా నిబంధనలకు విరుద్ధంగా విదేశీ కంపెనీలకు నిధులు మంజూరు ఎలా చేస్తారని అన్నారు. హద్దుల్లేని కేటీఆర్ అక్రమాలతో అధికారులు బలిపశువులుగా మారారని చెప్పుకొచ్చారు. నిబంధనలకు విరుద్ధంగా హుస్సేన్‌సాగర్ చుట్టూ ఫార్ములా ఈ రేసు కోసం 2.8 కి.మీల ప్రత్యేక ట్రాక్‌ను ఏర్పాటు చేశారని దుయ్యబట్టారు. నిబంధనలను అతిక్రమించి ప్రజలను ఇబ్బంది పెట్టడం వివరాలు 2లో

# మెట్రో కోచ్‌ల సంఖ్యను పెంచే యోచనలో ప్రభుత్వం

- ప్రస్తుతం 3 కోచ్‌లతో నడుస్తోన్న హైదరాబాద్ మెట్రో రైల్
- 6 కోచ్‌లుగా మార్చేందుకు ప్లాన్ చేస్తున్న ప్రభుత్వం
- అసెంబ్లీలో మంత్రి శ్రీధర్ బాబు కీలక ప్రకటన
- ఎల్ అండ్ టీతో సంప్రదింపులు జరుపుతున్నామని వెల్లడి



**హైదరాబాద్,డిసెంబర్ 20(పిసిడబ్ల్యూ న్యూస్):** హైదరాబాద్ మెట్రో రైలు కొద్దికాలంలోనే విశేష ప్రజాదరణ పొందింది. ట్రాఫిక్, కాలుష్య రహితమైన ప్రయాణాన్ని అందిస్తూ విభిన్నవర్గాలకు చేరువైంది. ప్రయాణికులకు మెరుగైన రవాణా అందిస్తూ రికార్డులు క్రియేట్ చేస్తోంది. నిత్యం 5 లక్షల మందికి పైగా ప్రయాణికులను తమ గమ్యస్థానాలకు చేరవేస్తోంది హైదరాబాద్ మెట్రో. ఏడేళ్లు పూర్తి చేసుకున్న హైదరాబాద్ మెట్రో ఎన్నో మైలురాళ్లను క్రియేట్ చేసింది. ఏడేళ్ల క్రితం భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభమైన హైదరాబాద్ మెట్రో రైలులో ఇప్పటివరకు 63 కోట్ల మందికి పైగా ప్రయాణం చేశారు. సగటున ప్రతిరోజు 4.75 లక్షల మంది మెట్రో ప్రయాణం చేస్తుండగా.. గరిష్టంగా 5.63 లక్షల మంది ప్రయాణికులుగా జర్నీ చేసినట్లు గణాంకాలు చెబుతున్నాయి. మెట్రో ప్రాజెక్టుల్లో ఢిల్లీ మెట్రో ప్రథమ స్థానంలో ఉంటే.. హైదరాబాద్ మెట్రో మూడోస్థానంలో కొనసాగుతోంది. పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టంలో మెట్రో రైళ్లు బ్యాక్ బోన్‌గా ఉంటున్నాయి. ప్రారంభంలో మెట్రో ప్రయాణాలపై అంతగా ఆసక్తి చూపని నగరవాసులు.. ఆ తర్వాత మెల్ల మెల్లగా మెట్రో ప్రయాణం వైపు మ్నొగ్గు చూపారు. ప్రస్తుతం ఎల్బీనగర్–మియాపూర్, నాగోల్–రాయదుర్గం, జేబీఎస్–ఎంజీబీఎస్ మూడు కారిడార్లలో సేవలందిస్తోంది హైదరాబాద్ మెట్రో. ప్రస్తుతం మూడు కారిడార్లలోనూ ప్రయాణికుల రద్దీ ఎక్కువగానే ఉంటోంది. హైదరాబాద్ వివరాలు 2లో

## హరియాణా మాజీ సీఎం ఓం ప్రకాశ్ చౌతాలా కన్నుమూత

(మొదటి పేజీ తరువాయి)

మరింత ముందుకు తీసుకెళ్లడానికి నిరంతరం కృషి చేశారు" అని ఎక్స్ వేదికగా మోదీ ట్వీట్ చేశారు. ఓం ప్రకాశ్ చౌతాలా మృతిపై హరియాణా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీ ట్వీట్ చేశారు. 'చౌతాలా మరణం చాలా బాధాకరం. ఆయనకు నా నివాళులు. ఆయన తన జీవింతాంతం రాష్ట్రానికి, సమాజానికి సేవ చేశారు. ఆయన మరణం రాష్ట్రానికి తీరని లోటు' అన్నారు. ఓం ప్రకాశ్ చౌతాలా మృతి పట్ల హరియాణా మాజీ సీఎం, కాంగ్రెస్ నేత భూపేంద్ర సింగ్ హుడా తీవ్ర విచారం వ్యక్తం చేశారు. "ఓం ప్రకాశ్ చౌతాలా సీఎంగా ఉన్నప్పుడు నేను లోక్‌సభ సభ్యునిగా ఉన్నాను. మా మధ్య మంచి స్నేహ సంబంధం ఉండేది. చౌతాలా ప్రజలకు ఎంతో సేవ చేశారు. ఆయన ఎప్పుడూ యాక్టివ్?గా ఉండేవారు. ఆయన ఇంత తొందరగా మనల్ని విడిచి వెళ్లిపోతారని నేను ఊహించలేదు. ఆయన చాలా మంచి వ్యక్తి, నాకు పెద్దన్నయ్య లాంటివారు" అని అన్నారు. ఓం ప్రకాశ్ చౌతాలా మరణవార్త చాలా బాధాకరం. ఆయన హరియాణాకు, దేశానికి ఎంతో సేవ చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేసు న్నాను. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తున్నాను' అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ట్వీట్ చేశారు.

## అసెంబ్లీలో గందరగోళ వాతావరణం

### - బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై వాటర్ బాటిళ్లు విసిరారని ఆరోపణ



**హైదరాబాద్,డిసెంబర్ 20(పిసిడబ్ల్యు న్యూస్):** అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై అధికార పార్టీ ఎమ్మెల్యే శంకర్ వాటర్ బాటిల్, పేపర్లు విసిరారు. విపక్ష సభ్యులకు చెప్పు చూపించాడని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆరోపించారు. ఆరో రోజు అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఫార్ములా ఈ కార్ రేస్‌పై సభలో చర్చించాలని బీఆర్ఎస్ పట్టుపట్టింది. సమావేశాలు జరుగుతున్నప్పుడు కేటీఆర్‌పై కేసు పెట్టారని, అక్రమ కేసు పెట్టినప్పుడు ఆయనకు చెప్పుకునే అవకాశం ఇవ్వాలని హరీశ్ రావు స్పీకర్‌ను కోరారు. దీనికి స్పీకర్ ప్రసాద్ కుమార్ నిరాకరించడంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నిరసన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భూ భారతి బిల్లుపై చర్చను ప్రారంభించారు. అయితే ఫార్ములా రేస్‌పై చర్చించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే స్పీకర్ పోడియం వద్ద నిరసనకు దిగారు. దీంతో మంత్రి వెనుక సీట్లో కూర్చున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే శంకర్ ఆగ్రహంతో ఊగిపోయారు. తన చైర్‌లోనుంచి లేచి ప్రతిపక్ష ఎమ్మెల్యేలపైకి వాటర్ బాటిల్, పేపర్లు విసిరారు. కాగా, విపక్ష సభ్యులకు శంకరయ్య చెప్పు చూపించారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనపై ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ పూర్తి వీడియోను బయటపెట్టాలన్నారు.

## ఫార్ములా ఈ- రేసులో అక్రమాలు జరిగిన మాట వాస్తవమే

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచడమా? బీఆర్ఎస్ నేతల దోపిడీతో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతీశారని, ఏం చేసినా వారి స్వలాభం కోసమేనన్నారు. ప్రజలు ఛీకొట్టి గద్దె దింపినా అధికారంలో ఉన్నామనే భ్రమలతో కేటీఆర్ బెదిరింపు వ్యాఖ్యలు చేస్తున్నారని తెలిపారు. కేసులో అధికారులకు సహకరించాల్సిన కేటీఆర్, అహంకారంతో విర్రవీగుతూ ఉద్యమకారులంటూ కేసుకు సంబంధం లేని మాటలు చెప్పడంపై టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్యే మహేష్ కుమార్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.ం

## ఎన్నికల హామీలపై చర్చ జరగాల్సిందే.. : తలసాని శ్రీనివాస్‌యాదవ్

**హైదరాబాద్,డిసెంబర్ 20(పిసిడబ్ల్యు న్యూస్):** అసెంబ్లీ ఎన్నికల గెలుపు కోసం కాంగ్రెస్ పార్టీ ఎన్నో అలవికాని హామీలు ఇచ్చిందని, ఇప్పుడు ఆ హామీలను నెరవేర్చడంలో విఫలమైందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆరోపించారు. ఆ హామీలపై చర్చ పెట్టాలని తాము కోరామని తెలిపారు. ఇవాళ ఉదయం శాసనసభ సమావేశాల ప్రారంభానికి ముందు మీడియా పాయింట్‌లో తలసాని మాట్లాడారు. ఫార్ములా వన్ రేసు సందర్భంగా అవినీతి జరిగిందంటూ తమ నాయకుడు కేటీఆర్‌పై కేసు పెట్టారని, ఫార్ములా వన్‌పై చర్చ జరగాలని తాము డిమాండ్ చేస్తున్నామని తలసాని వెల్లడించారు. శాసనసభలోతమ దళిత ఎమ్మెల్యేలకు చెప్పులు చూపించారని ఆయన ఆరోపించారు. సభ రికార్డులు బయటపెట్టాలని డిమాండ్ చేశారు. తాము అన్ని విధాల సభకు సహకరించడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు.

## ధరణి దోపిడికి భూ భారతితో చెక్: రేవంత్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

ధరణి పోర్టల్ నిర్వహణ ఏ కంపెనీ చేతిలోకి వెళ్ళినా సీఈఓ గా గాదె శ్రీధర్ రాజే ఉన్నారని పేర్కొన్నారు. శ్రీధర్ రాజు ద్వారా విదేశాలకు సమాచారాన్ని పంపించారని ఆరోపించారు. అత్యంత సున్నితమైన సమాచారాన్ని విదేశీయుల చేతిలో పెట్టారని.. ఈ తీవ్రమైన నేరానికి పాల్పడిన బాధ్యులకు తప్పకుండా శిక్ష పడాలన్నారు. విదేశాలకు వెళ్లి వివరాలు ఇవ్వాలని కోరినా వారు సహకరించడం లేదని తెలిపారు సీఎం రేవంత్.ధరణి పోర్టల్ తో రైతుల సమాచారాన్ని పూర్తిగా దుర్వినియోగం చేశారని అన్నారు సీఎం. ఈ పోర్టల్ నిర్వహిస్తున్న సంస్థ సిఈవో గాదె శ్రీధర్ రాజు ద్వారా డేటాను విదేశాలకు పంపించారని పేర్కొన్నారు. అక్కడ వాళ్ళు ఒక్క క్లిక్ కొడితే మన సమాచారం అంతా నాశనం అవుతుందని.. ఇక్కడి సర్వర్లు కూడా క్రాష్ అవుతాయని తెలిపారు. అందుకే మేము అధికారంలోకి రాగానే ఎంతోమంది నిపుణులు, మేధావులు, రైతు నేతలతో చర్చించి ధరణిని రద్దు చేశామని వెల్లడించారు.భూములపై ఫోరెన్సిక్ ఆడిట్ చేయాల్సిందేనని స్పష్టం చేశారు. ధరణి పేరుతో ఆర్థిక నేరాలకు పాల్పడ్డారని ఆరోపించారు.**భూ భారతి బిల్లుకు అసెంబ్లీ ఆమోదం..** భూ భారతి బిల్లుకు తెలంగాణ అసెంబ్లీలో ఆమోదం లభించింది. ఆర్ఓఆర్ – 2020 ని కూడా పూర్తిగా ప్రక్షాళన చేస్తూ.. కొత్త చట్టాన్ని తీసుకువచ్చింది. భూ దస్త్రాలు, యాజమాన్య హక్కుల చట్టం – 2024 పేరుతోనే అసెంబ్లీలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఈ బిల్లును ప్రవేశపెట్టారు. సభ్యుల చర్చ అనంతరం ఈ బిల్లుని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఆమోదించారు. ఈ బిల్లుతో ప్రస్తుతం ఉన్న ధరణి రికార్డులను పూర్తిగా ప్రక్షాళన చేయనుంది ప్రభుత్వం. కొత్త చట్టం కింద రికార్డులను నమోదు చేస్తారు. గతంలో రద్దు చేసిన అనుభవదారుడి కాలమ్ ను మళ్లీ తీసుకురానున్నారు.

## ఫార్ములా-ఈరేస్ కేసులో అణాపైసా అవినీతి జరగలేదు

(మొదటి పేజీ తరువాయి)

పట్టిస్తున్నారో అర్థం కావడంలేదని చెప్పారు. తనపై కేసు నిలవడదని స్పష్టం చేశారు. లీగల్‌గా ముందుకు వెళ్తామని, లంచ్ మోషన్ పిటిషన్‌పై కోర్టు తేలుస్తుందన్నారు.ఓఆర్ఆర్ లీజు అంశంలో సిట్ ఏర్పాటుపై కూడా కేటీఆర్ స్పందించారు. టీఓటీ పద్ధతి దేశంలో ఇప్పటికే అమలులో ఉందన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు లీజు డబ్బును రైతు రుణమాఫీకి ఉపయోగించామని చెప్పారు. ఆర్థిక వనరుల సమీకరణపై అప్పటి ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్యాబినెట్ సబ్ కమిటీ అనేక సూచనలు ఇచ్చింది. ఓఆర్ఆర్ నుంచి డబ్బులు సేకరించవచ్చని సూచించింది. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా జాతీయ రహదారులు నుంచి డబ్బులు సేకరిస్తున్న టీఓటీ తరహాలోనే ఓఆర్ఆర్ లీజు నుంచి డబ్బులను సేకరించాం. ప్రైవేట్ కంపెనీకి లబ్ధి చేకూర్చినట్టు ఆరోపిస్తున్న రేవంత్ ఆ కంపెనీతో లీజుని ఎందుకు రద్దు చేయడం లేదని ప్రశ్నించారు. గతంలో ఓఆర్ఆర్ లీజుపై రూ.లక్ష కోట్ల అవినీతి అంటూ రేవంత్ రెడ్డి మాట్లాడిన అడ్డగోలు మాటలపై హెచ్ఎండిఏ పరువు నష్టం కేసు వేసింది. ఇప్పటికీ ఆ కేసు అలాగే ఉంది. ముఖ్యమంత్రి ఓఆర్ఆర్‌పై అనేకసార్లు కుంభకోణం అని మాట్లాడారు. మరి ఆ లీజును ఎందుకు రద్దు చేయడం లేదన్నారు. రేవంత్ రెడ్డి మున్సిపల్, హోంశాఖ మంత్రిగా ఉన్నారు. ఇలాంటి సందర్భంలో సిట్ ద్వారా తన పరిధిలో ఉన్న అధికారులతో వాస్తవాలు ఎలా బయటకు వస్తాయి. తన సొంత శాఖ అధికారులతో దర్యాప్తు చేస్తే నిజాలు ఎలా బయటకు వస్తాయో రేవంత్ చెప్పాలి. అందుకే ఓఆర్ఆర్ లీజును వెంటనే రద్దుచేసి.. సిట్టింగ్ జడ్జితో కానీ రిటైర్డ్ జడ్జితో కానీ నిష్పాక్షిక విచారణ జరిపించాలి. ఒకవేళ కుంభకోణం జరిగి ఉంటే ఆయాచితంగా లబ్ధి జరిగిన కంపెనీని కాంట్రాక్టు ఎందుకు రద్దు చేయడం లేదు. సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించకుంటే ఇది మరొక రాజకీయ కక్ష సాధింపు కేసు అని ప్రజలు అనుకుంటారు. న్యాయమూర్తి ఏర్పాటు చేసే బృందం జాతీయ రహదారుల సంస్థ విధానాలను అధ్యయనం చేయాలని కూడా సూచిస్తాం. మాపై ఆరోపణలు చేసి కక్ష సాధింపుల కోసం మాత్రమే పరిమితం కాకుండా వాస్తవాలు తెలిసేలా మాట్లాడాలి. కోకాపేట భూములపై రూ.10 వేల కోట్ల కుంభకోణం అంటున్నారు. స్కామ్ అయితే ఆ భూముల అమ్మకాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయాలి' అన్నారు. ఎమ్మెల్యేలకు శిక్షణ ఇచ్చి స్పీకర్, ప్రతిపక్ష సభ్యులపైకి వాటర్ బాటిళ్లు, పేపర్లు విసరడం ఎలా అని శిక్షణ ఇచ్చారా అని కేటీఆర్ ప్రశ్నించారు. దళితుడు అంటూ పదే పదే చెప్పడం స్పీకర్ గౌరవాన్ని తగ్గించేలా చేయడమేనన్నారు.

## మెట్రో కోచ్‌ల సంఖ్యను పెంచే యోచనలో ప్రభుత్వం

(మొదటి పేజీ తరువాయి)

మహానగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యను అధిగమిస్తూ, వేగంగా ప్రయాణించేందుకు ఎక్కువ శాతం మెట్రోను ఆశ్రయిస్తున్నారు. వీరితోడు ఉద్యోగులు, విద్యార్థులు సైతం ప్రయాణాలకు ఇష్టపడుతున్నారు. దీంతో మెట్రో రైలులో సైతం విపరీతమైన రద్దీ ఏర్పడుతోంది. బిజినెస్ వేళల్లో కనీసం కాలు నిలపలేని పరిస్థితి. ప్రస్తుతం ట్రైన్లలో కూర్చుని ప్రయాణాలు చేసేందుకు ఏమాత్రం అవకాశం దొరకడం లేదు. ఈ క్రమంలోనే మెట్రో కంపార్ట్‌మెంట్ల సంఖ్య పెంచాలని ప్రయాణికులు ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. మెట్రో ప్రయాణికుల రద్దీపై రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు అసెంబ్లీలో కీలక ప్రకటన చేశారు. ప్రయాణికుల సౌకర్యార్థం మెట్రో కోచ్‌ల సంఖ్యను పెంచే యోచనలో ఉన్నట్లు తెలిపారు. ప్రస్తుతం హైదరాబాద్ మెట్రో రైల్ 3 కోచ్‌లతో నడుస్తోంది. కావున రద్దీని దృష్టిలో ఉంచుకుని అదనపు కోచ్‌లను ఏర్పాటు చేయాలన్న అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. మెట్రోను 3 కోచ్‌లతో నడిపేందుకు డిజైన్ చేసినట్లు తెలిపిన మంత్రి.. దాన్ని 6 కోచ్‌లుగా మార్చేందుకు ప్లాన్ చేస్తున్నామన్నారు. త్వరలోనే ఆరు కోచ్‌లుగా అప్‌గ్రేడ్ చేసేందుకు మెట్రో అధికారులు, ఎల్ అండ్ టీ యాజమన్యంతో సంప్రదింపులు జరుపుతున్నామన్నారు. కోచ్‌ల పెరిగితే, హైదరాబాద్ మెట్రోలో ప్రయాణికుల రద్దీ తగ్గుతుందని, కూర్చొని ప్రయాణించే వీలు కలుగుతుందని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు.ఇక మెట్రో సెకండ్ ఫేజ్‌కు కూడా రేవంత్ సర్కార్ సిద్ధమవుతున్న సంగతి తెలిసిందే! రెండో దశలో చేపట్టబోయే పనులపై డీపీఆర్ రెడీ అయింది. శంషాబాద్ విమానాశ్రయం వరకు నిర్మించేందుకు ప్రతిపాదించిన మెట్రో మార్గం.. పలు ప్రత్యేకతల సమాహారంగా ఉండబోతోంది. ఎయిర్‌పోర్ట్ కారిడార్‌లో అండర్ గ్రౌండ్ మార్గం నిర్మించేలా ప్రణాళిక రెడీ చేశారు. నాగోల్-ఎయిర్‌పోర్ట్, రాయదుర్గ్-కోకాపేట్, ఎంజీబీఎస్-చంద్రాయణగుట్ట, మియాపూర్-పటాన్‌చెరు, ఎల్‌బీనగర్-హయత్‌నగర్, మియాపూర్ %-% పటాన్‌చెరు వరకు అవకాశం ఉన్న చోట డబుల్ డెక్కర్ నిర్మిస్తారు. రెండో దశలో ప్రతి కిలో మీటరుకు రూ.318 కోట్లు ఖర్చు అవుతుంది.

## హైకోర్టులో కెటిఆర్‌కు స్వల్ప ఊరట

- 30 వరకు అరెస్ట్ చేయవద్దని ఆదేశం
- క్వాష్ పిటిషన్‌పై వాదనలు విన్న కోర్టు
- తదుపరి విచారణ 27కు వాయిదా




**హైదరాబాద్,డిసెంబర్ 20(పిసిడబ్ల్యు న్యూస్):** భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్‌కు హైకోర్టులో స్వల్ప ఊరట లభించింది. ఫార్ములా-ఈ కార్ రేస్ వ్యవహారంలో తెలంగాణ ఏసీబీ తనపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను క్వాష్ చేయాలని కేటీఆర్ దాఖలు చేసిన లంచ్ మోషన్ పిటిషన్‌పై విచారణ జరిగింది. ఇరు వైపులా వాదనలు విన్న ధర్మాసనం.. ఈనెల 30 వరకు కేటీఆర్‌ను అరెస్టు చేయొద్దని ఆదేశించింది. కేటీఆర్‌పై ఏసీబీ నమోదు చేసిన కేసులో దర్యాప్తు కొనసాగించవచ్చని స్పష్టం చేసింది. పది రోజుల్లో కౌంటరు దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ.. తదుపరి విచారణను ధర్మాసనం ఈనెల 27కి వాయిదా వేసింది. అయితే ప్రాథమిక దర్యాప్తు ఇప్పటికే పూర్తయినందున మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వొద్దని రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏజీ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. కేటీఆర్ తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సుందరం, ప్రభాకర్‌రావు, గండ్ర మోహన్‌రావు వాదనలు వినిపించారు. అవినీతి నిరోధక చట్టం కింద పెట్టిన సెక్షన్లు ఈ కేసుకు వర్తించవని, ఎఫ్ఐఆర్‌ను క్వాష్ చేయాలని కోరారు. 'అవినీతి నిరోధక చట్టం కింద పెట్టిన సెక్షన్లు ఈ కేసుకు వర్తించవు. ముఖ్యంగా 13(1)(జీ) సెక్షన్ ఈ కేసుకు వర్తించదు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని అనేందుకు ఆధారాలు లేవు. ప్రొసీజర్ పాటించలేదనడం సరైంది కాదు. 14 నెలల తర్వాత ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ప్రాథమిక విచారణ కూడా లేకుండా కేసు పెట్టారు. కేవలం రాజకీయ కక్షసాధింపు కోసమే కేటీఆర్‌పై కేసు పెట్టారు.ఈ కేసులో ఎన్నో తప్పులు కనిపిస్తున్నాయి. కార్ రేస్ నిర్వహణకు 2022 అక్టోబరు 25న ఒప్పందం జరిగింది. సీజన్ 10 నిర్వహణకు స్పాన్సర్ వెనక్కి తగ్గారు. రేస్ నిర్వహణలో ఇబ్బందుల నివారణకే ప్రభుత్వం రంగంలోకి దిగింది. ఇబ్బందులు రాకూడదనే హెచ్ఎండీఏ చెల్లింపులు చేసిందని వాదించారు. సీజన్-9 వల్ల దాదాపు రూ.700 కోట్ల లాభం వచ్చింది. ఆర్థికశాఖ అనుమతి లేదని ఏసీబీ అధికారులు అంటున్నారు. కార్ రేసింగ్ ఒప్పందాన్ని కొత్త ప్రభుత్వం ఉల్లంఘించింది. కొత్త ప్రభుత్వం డబ్బు చెల్లించకపోవడంతో ఒప్పందం రద్దయింది. ఎఫ్ఐఆర్ నమోదులో ఆలస్యానికి కారణాలు చెప్పలేదు. సుప్రీం తీర్పుల ప్రకారం ఎఫ్ఐఆర్ నమోదులో ఆలస్యం తగదు. ఎఫ్ఐఆర్ నమోదుకు ముందు ప్రాథమిక విచారణ అవసరమని సుప్రీంకోర్టు తీర్పులు ఉన్నాయి. సుప్రీంకోర్టు తీర్పులను ఏసీబీ అధికారులు పట్టించుకోలేదు. ప్రజాప్రతినిధిపై కేసుకు ముందు ప్రాథమిక విచారణ చేయాలి. 18న ఫిర్యాదు అందగానే.. 19న ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కేటీఆర్ స్పెక్యులేషన్ చేసినట్టు ఎక్కడా పేర్కొనలేదు. అవినీతి ఎక్కడ జరిగిందో చెప్పలేదు. కానీ, అవినీతి నిరోధక చట్టం కింద కేసు పెట్టారు' అని కేటీఆర్ తరఫు న్యాయవాది సుందరం వాదనలు వినిపించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏజీ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. 'ఎఫ్ఐఆర్ నమోదు ప్రాథమిక అంశం మాత్రమే. అందులో పేర్కొన్న అంశాలే అంతిమం కాదు. దర్యాప్తులో తేలే విషయాల ఆధారంగా సెక్షన్లు చేరుస్తారు. రెండు నెలల క్రితమే కేసు నమోదుకు నిర్ణయించారు. కేసు నమోదు కోసం గవర్నర్ నిర్ణయానికి పంపారు. గవర్నర్ ఆమోదించాకే కేసు నమోదు చేశారు. ఫార్ములా సంస్థకు డబ్బు విదేశీ కరెన్సీలో చెల్లించారు. దీంతో హెచ్ఎండీఏపై అధిక భారం పడింది. విదేశీ కరెన్సీలో చెల్లింపు కోసం ఆర్‌బీఐ అనుమతి తీసుకోలేదు. ఆర్థికశాఖ అనుమతి కూడా లేదు' అని ఏజీ వివరించారు. గవర్నర్ అనుమతి కాపీని కోర్టు అడగడంతో ఏజీ అందజేశారు. చెల్లింపుల్లో కేటీఆర్ పాత్ర ఏంటని ఈ సందర్భంగా హైకోర్టు ప్రశ్నించింది. కేటీఆర్ పాత్ర ఏంటో దర్యాప్తులో తేలుతుందని ఏజీ తెలిపారు. ఎఫ్ఐఆర్ నమోదు అనేది దర్యాప్తు కోసమేనని వివరించారు. కేసు పూర్తి వివరాలు అభియోగపత్రంలో ఉంటాయని, రూ.56 కోట్లకు పైగా చెల్లింపుల్లో నిబంధన ఉల్లంఘన జరిగిందని ఏజీ కోర్టు దృష్టికి తెచ్చారు. ఫార్ములా ఈ-కార్ రేస్‌లో కేటీఆర్‌పై ఏసీబీ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఈ కేసును కొట్టివేయాలని మాజీ మంత్రి పిటిషన్ వేశారు.

## అక్కడ అంబేడ్కర్‌కు.. ఇక్కడ స్పీకర్‌కు అవమానం

- కెటిఆర్ ఎందుకు భయపడుతున్నట్లు
- జైలులో యోగా చేస్తానని చెప్పలేదా
- కేబినేట్ అనుమతి లేకుండా డబ్బులు ఎలా చెల్లిస్తారు
- మంత్రి సీతక్క ఘాటు విమర్శలు
- భారాస ఎమ్మెల్యేల సభ్యత్వం రద్దు చేయాలన్న కాంగ్రెస్



**హైదరాబాద్,డిసెంబర్ 20(పిసిడబ్ల్యు న్యూస్):** పార్లమెంటులో అంబేద్కర్‌ను, అసెంబ్లీలో దళిత స్పీకర్‌ను అవమానించారని మంత్రి సీతక్క అన్నారు. అసెంబ్లీ ఆవరణలో మీడియాతో చిట్‌చాట్‌లో ఆమె మాట్లాడారు. క్యాబినెట్ ఆమోదం తీసుకొని ఫార్ములా ఈ-రేసుకు కేటీఆర్ డబ్బులు చెల్లించారా అని ప్రశ్నించారు. ముసుగు వేసుకుని భారాస రాజకీయం చేస్తోందని విమర్శించారు. 'జైలుకు వెళ్లి యోగా చేస్తానన్న కేటీఆర్ ఎందుకు భయపడుతున్నారు. తప్పు చేయకపోతే విచారణ ఎదుర్కొని నిర్దోషిగా బయటికి రావచ్చు కదా? కేటీఆర్ తన సమస్యను రాష్ట్ర ప్రజల సమస్యగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారు. ప్రభుత్వ అనుమతి లేని అంశానికి సభలో చర్చ ఎందుకు అని అడిగారు. గవర్నర్ క్లియరెన్స్ ఇచ్చిన కేసుకు సభలో చర్చ అవసరం లేదని చెప్పారు. బీఏసీలో ఫార్ములా ఈ-రేసు మీద చర్చ కోసం భారాస ఎందుకు అడగలేదని ప్రశ్నించారు. గతంలో ప్రభుత్వ కేసులు ఎదుర్కొన్న నాయకులు కోర్టుకు వెళ్తే తప్పుపట్టిన ఆయన.. ఇప్పుడు కోర్టు మెట్లు ఎందుకు ఎక్కారు? కేటీఆర్‌కు నిజాయతీ లేదు. లక్షలాది మంది రైతులకు ప్రయోజనం చేకూర్చే భూ భారతి బిల్లుపై చర్చ జరగకుండా అడ్డుకునే కుట్ర చేస్తున్నారు. వాళ్ల భూ కబ్జాల బాగోతం బయట పడుతుందనే ఇలా చేస్తున్నారు. అందరూ చట్టం ముందు సమానులే.. ఫార్ములా ఈ-రేసు కేసులో విచారణ ఎదుర్కోవాల్సిందే' అని సీతక్క చెప్పారు. ఇదిలావుంటే భారాస ఎమ్మెల్యేల సభ్యత్వం రద్దు చేయాలని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. స్పీకర్‌ను అవమానించిన వారి సభ్యత్వం రద్దుకు డిమాండ్ చేస్తున్నామన్నారు. దళిత వ్యక్తి సభాపతి అయినందునే ఎమ్మెల్యేలు పేపర్లు చింపి విసిరారన్నారు. వారి ప్రవర్తన దురహంకారానికి నిదర్శనమని పేర్కొన్నారు. దళితుడైన స్పీకర్‌పై పరుష పదాలతో మాట్లాడారని చెప్పారు. గతంలో సంపత్‌కుమార్ పేపర్ విసిరేస్తే అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేశారని గుర్తు చేశారు. భారాస ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయాలని స్పీకర్, సీఎంను కోరుతున్నామని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తెలిపారు. శుక్రవారం తెలంగాణ శాసనసభలో అధికార, విపక్షాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. భారాస ఎమ్మెల్యేలు పార్ములా ఈ-రేసుపై చర్చకు పట్టుబట్టారు. అది ఒక వ్యక్తికి సంబంధించిన అంశమని స్పీకర్ తెలిపారు. దీంతో భారాస ఎమ్మెల్యేలు స్పీకర్ పోడియం వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించగా మార్షల్స్ అడ్డుకున్నారు. ఈక్రమంలో భారాస శాసనసభ్యులు పేపర్లు చించి సభాపతి వైపు విసిరారు. అనంతరం భారాస ఎమ్మెల్యేలు ఉన్న వైపు కొందరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పేపర్లు చించి విసిరారు. వారంతా పరస్పర నినాదాలు, ఆరోపణలు చేసుకున్నారు.

# అంబేద్కర్ కొందరి వాడు కాదు.. అందరి వాడు..

**• భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబెడ్కర్ గారి పై చేసిన వాక్యాలను తక్షణమే వెనక్కి తీసుకొని బహిరంగ క్షమాపణ చెప్పాలి!**



**హనుమకొండ ప్రతినిధి, డిసెంబర్ 20(పిసిడబ్ల్యూ న్యూస్):** పార్లమెంట్‌లో భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న బాబాసాహెబ్ అంబేద్కర్ పై రాజ్యసభలో కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తు వెంటనే కేంద్ర మంత్రివర్గం నుంచి హెూం శాఖ మంత్రిని బర్త్ రఫ్ చేయాలని మాదిగ హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మైస.ఉపేందర్ మాదిగ డిమాండ్ చేశారు.శుక్రవరం ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ.. రాజ్యసభలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ని అవమాన పరుస్తూ ఇలాంటి వ్యాఖ్యలు చేశారంటే మీ పార్టీకి మీకు మీ మంత్రి వర్గానికి దళితులు అంటే ఎంత చిన్నచూపో అర్థం వాళ్లతో తన విమర్శించారు. కానీ ఈనాడు అంబేద్కర్ అంటే ఒక దళిత వర్గానికి చెందిన వ్యక్తి కాదు యావత్ భారత దేశ ప్రజల ఆకాంక్ష ఆరాధ్య దైవం అని మీరు గుర్తు చేసుకోవాలని,ఈనాడు భారతదేశంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ని దేవుడు లాగా అందరూ ఆరాధిస్తారు.ఇది మన భారతదేశ సంస్కృతి అది మీరు మరిచి భారత దేశం లో ఒక్కడే అధాని ఒక్కటే మతం ఒక్కటే పార్టీ బీజేపీ అనే విధంగా ఒక్కడే ప్రధాన మంత్రి మోడీ అని అయన జపం చేస్తూ పరిపాలనను పక్కకు పెట్టి కాలయాపన చేయడాన్ని తీవ్రం గా ఖండిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మీరు చేసిన అనుచిత వాక్యాలను వెనక్కి తీసుకొని, ఇదే పార్లమెంట్ సాక్షి గా బహిరంగ క్షమాపణ చెప్పాలి అని డిమాండ్ చేశారు.

# విద్యార్థి దశలో క్రమశిక్షణ అలవర్చుకోవాలి క్రమశిక్షణ ఉంటేనే భవిష్యత్తు

**• న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి కే.వెంకటేష్**




**రామడుగు,డిసెంబర్ 20 (పిసిడబ్ల్యూ న్యూస్):** రామడుగు మండలంలోని వెదిరా గ్రామంలో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సుసీనియర్ సివిల్ జడ్జ్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కే వెంకటేష్ ఆధ్వర్యంలో వెదిర గ్రామంలోని జిల్లా ప్రజా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నందు న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు, విద్యార్థులు విద్యార్థి దశలో ముఖ్యంగా క్రమశిక్షణ అలవర్చుకోవాలని క్రమశిక్షణ ఉంటేనే భవిష్యత్తు బాగుంటుందని తెలిపారు, విద్యార్థి దశ నుండి జీవితంలో స్థిరపడే వరకు ఏదో ఒక చట్టానికి అనుగుణంగా నడుచుకోవాల్సి వస్తుందని, కాబట్టి విద్యార్థులు వివిధ చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని తెలిపారు, ఈ సందర్భంగా విద్యార్థులకు ర్యాగింగ్ నిర్మూలన చట్టం, మాదకద్రవ్యాల నిర్మూలన, పోక్సో చట్టం, మరియు సైబర్ మోసాల నుండి ఏ విధంగా జాగ్రత్తపడాలో అవగాహన కల్పించారు ఈ సందర్భంగా పాఠశాలలోని వంటగది మరియు ఆహారాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎలాంటి న్యాయపరమైన లేదా న్యాయ సేవ అవసరమైన సంప్రదించవలసిందిగా పాఠశాల సిబ్బందిని ఆదేశించారు, ఇట్టి కార్యక్రమంలో న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కే వెంకటేష్ తో పాటు జిల్లా లీగల్ ఏడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ తణుకు మహేష్, పాఠశాల బోధన బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

# డా.బి.ఆర్.అంబేద్కర్‌ను అవమాన పరచిన అమిత్ షా క్షమాపణ చెప్పాలి

**• ఎస్సి సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రజినీకాంత్**

**కురవి, డిసెంబర్20(పిసిడబ్ల్యూ న్యూస్):** మండల కేంద్రంలో భారత రత్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ నీ భారత పార్లమెంట్ లో అవహేళన చేస్తూ,అహంభావపూరిత వాక్యాలు చేసిన ,కేంద్ర హెూమ్ శాఖ మంత్రి అమిత్ షా వైఖరిని నిరసిస్తూ మహబూబాబాద్ జిల్లా ఎస్సి సెల్ ఆధ్వర్యంలో అంబేద్కర్ కు పాలాభిషేకం పూలమాల వేసి అమిత్ షా యొక్క దిష్టి బొమ్మని దగ్ధం చేయడం జరిగింది.ఈ సందర్భంగా ఎస్సి సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రజినీకాంత్ మాట్లాడుతూ పార్లమెంట్ లో హెూం మంత్రి అమిత్ షా భారత రాజ్యాంగం ద్వారా హక్కుల పొందుతున్న ప్రతి భారతీయ పౌరునికి తక్షణమే క్షమాపణ చెప్పాలని,డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాసిన భారత రాజ్యాంగమే లేకుంటే నీకు హెూం మంత్రి పదవి ఎక్కడిదని అన్నారు. మణిపూర్ రాష్ట్రం అల్లర్లతో అట్టుడికి పోతూ ప్రాణం నష్టం జరుగుతుంటే చోద్యం చూస్తూ అల్లర్లను ఆపలేని చేతగాని హెూం మంత్రి అమిత్ షా బిజెపి పార్టీ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేతగాని పరిపాలనకు నిదర్శనం అని అన్నారు బడుగు బలహీన వర్గాల ప్రజలకు అంబేద్కర్ వారసులను చిచ్చులు పెట్టి రెచ్చగొట్టే మాటలు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అల్లర్లు సృష్టించాలని చూస్తున్నారన్నారు.భారత రాజ్యాంగం పట్ల ఏ మాత్రం గౌరవం లేకుండా బాబాసాహెబ్ అంబేద్కర్ ని అగౌరవపరిచే విధంగా మాట్లాడడం సిగ్గుచేటు అన్నారు భారత రాజ్యాంగాన్ని పట్టుకొని దేశ ప్రజలకు భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.ఈకార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి అవిరే మోహన్ రావు,ధర్మకర్త చిన్నం గణేష్ ,ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కమాండ్ల వీరన్న,మిరియాల లక్ష్మయ్య,దళితరత్న దైద భద్రయ్య,సీనియర్ నాయకులు మలిశెట్టి వేణు,తుకారం నాయక్,బాదే వీరభద్రం, లక్ష్మణ్ నాయక్,యూత్ ఉపాధ్యక్షులు కొర్ని అనిల్, డోర్నకల్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు జాటోత్ లక్ష్మణ్ నాయక్,రేకుల తండ గ్రామ అధ్యక్షులు లాలా నాయక్, నారాయణపురం గ్రామ అధ్యక్షులు రమేష్ నాయక్,కంచర్ల గూడెం గ్రామ అధ్యక్షులు బాలు నాయక్,ధర్మకర్త వెంపటి శీను,డి.నాగేశ్వరావు,దైద వీరయ్య,జక్కుల నాగన్న,చెరుకుపల్లి మోహన్,నూకల నాగన్న,రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



# కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షాపై కేసు నమోదు చేయాలి

**• AYS రాష్ట్ర ప్రచార కార్యదర్శిపుల్ల మల్లయ్య**



**మొగుళ్లపల్లి, డిసెంబర్ 20(పిసిడబ్ల్యూ న్యూస్):** భారత రాజ్యాంగ రచయిత ప్రపంచ మేధావి డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ గారిని పార్లమెంట్ లో కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా అంబేద్కర్ అంబేద్కర్ అంబేద్కర్ ను అవమాన పరిచే విధంగా మాట్లాడిన కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా ను మంత్రి పదవి నుంచి బిజెపి పార్టీ నుండి బర్తరఫ్ చేయడమే కాకుండా తక్షణమే కేసు నమోదు చేయాలని తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ పుల్ల మల్లయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం రోజున మొగుళ్ళ పెల్లి మండల కేంద్రంలో అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు మంగళ పెల్లి శ్రీనివాస్ అధ్యక్షతన భారత రత్న బాబా సాహెబ్ అంబేద్కర్ గారిని కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా మాట్లాడిన మాటలకు నిరసన బస్టాండ్ కుండలిలో కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా మల్లయ్య మాట్లాడుతూ భారత దేశం వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి బాబా సాహెబ్ అంబేద్కర్ గారు రచించిన భారత రాజ్యాంగం ప్రకారం పదవులు చేపట్టారని ఆయన అన్నారు.ఇటీవల కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా పార్లమెంట్ లో అంబేద్కర్ గారిని అంబేద్కర్ అంబేద్కర్ అంబేద్కర్ ఈ నామము భారత దేశంలో ఇప్పుడు జపమై ఫ్యాషన్ అయిపోయిందని హేళనగా అంబేద్కర్ పేరు కు బదులు హిందూ దేవుళ్ళ పేర్లను స్మరిస్తే ఏడు జన్మల పాటు స్వర్గం ప్రాప్తి కలుగుతుందని మాట్లాడిన అమిత్ షా ను కేంద్ర హెూంశాఖ మంత్రి పదవి నుంచి బిజెపి పార్టీ నుండి తొలగించాలని తక్షణమే కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బిజెపి పార్టీ అసలు రంగు బయటపడిందని తెలిపారు. దేశ ప్రజల మనోభావాలు దెబ్బతినే విధంగా మాట్లాడిన అమిత్ షా ను మంత్రి పదవితో పాటు బిజెపి పార్టీ నుండి తొలిగించే వరకు దేశవ్యాప్తంగా దశల వారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అంబేద్కర్ యువజన సంఘం మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నిమ్మల భద్రయ్య, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుల అంతడుపుల సారంగపాణి అంబేద్కర్ యువజన సంఘం మండల నాయకులు సురేందర్. నేరెళ్ల సమ్మయ్య, బండారి పాపయ్య, దూడపాక రాజేష్ పాల్గొన్నారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, ఆయుష్మాన్ ఆరోగ్య సెంటర్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా వైద్య అధికారి డాక్టర్ గోపాలరావు





**ములుగు, డిసెంబర్ 20(పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు మండలంలోని రాయిని గూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జంగాలపల్లి లోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ సెంటర్ ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్. గోపాలరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఆయుష్మాన్ ఆరోగ్యం మందిర్ జంగాలపల్లి మరియు రాయిని గూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వైద్య సేవల కొరకు, వచ్చిన రోగుల తో మాట్లాడుతూ, వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు.రాయినిగూడెం ఆరోగ్య కేంద్రంలో నీ మందుల నిల్వ ఉన్న గదిని పరిశీలించి అందుబాటులో ఉన్న మందుల వివరాలను అడిగి తెలుసుకుని మందుల నిల్వల రిజిస్టర్ను పరిశీలించారు. అందుబాటులోని మందులను ముందస్తుగానే ఇండెంట్ పెట్టుకుని మందులు లను సమకూర్చుకోవాలని సిబ్బందికి తెలిపారు. రోగులకు పరీక్షలు చేసే గదిని పరిశీలించి, పరీక్షల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రోగుల ఇన్ పేషెంట్ వార్డును కూడా పరిశీలించారు.అటు తర్వాత ఆరోగ్య కేంద్రం చుట్టూ ఉన్న పరిసరాలను పరిశీలించి శుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికనీ ఆదేశించారు. ఆరోగ్య కేంద్రం పరిధిలో పనిచేస్తు న్న ఆయుష్మాన్ ఆరోగ్యం మందిర్ డాక్టర్లకు, సూపర్వైజర్ , ల్యాబ్ టెక్నీషియన్స్ , స్టాఫ్ నర్స్ , ఆరోగ్య కార్యకర్తలు మరియు ఇతర సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని నిర్వహించి, సమయపాలన పాటిం చకుండా, మెరుగైన వైద్య సేవలు అందించని సిబ్బందిపై మరియు జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను 100% లక్ష్యాలను సాధించని నిర్లక్ష్య ధోరణి ఉన్న సిబ్బందిపై శాఖపరమైన చర్యలు ఉంటాయని సిబ్బందినీ హెచ్చరించారు. జంగాలపల్లి ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ డాక్టర్. నవ్యరాణి ,డాక్టర్. నాగ అన్వేష్ ,డాక్టర్. శ్రవణ్, సీనియర్ అసిస్టెంట్ అన్నపూర్ణ, సూపర్వైజర్ నిర్మల మేరీ, స్టాఫ్ నర్స్ సత్యకుమారి, ల్యాబ్ టెక్నీషియన్ సుజాత, ఆరోగ్య కార్యకర్త శ్రీలత ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# నాయకపోడ్ దెబ్బ వెంకటాపూర్ మండల ఇంఛార్జ్‌గా బానారి సమ్మయ్య ఎంపిక



**ములుగు, డిసెంబర్ 20 (పీసీడబ్ల్యు న్యూస్):** ములుగు జిల్లా కో చైర్మన్ గుర్రపు రామరావు అధ్యక్షతన మండల కేంద్రంలోని నాయకపోడ్ గూడెంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ముఖ్య అతిథులుగా విచ్చేసిన నాయకపోడ్ దెబ్బ ఉత్తర తెలంగాణ జిల్లాల ఇంఛార్జ్ గాలి సమ్మయ్యనాయక పోడ్ మాట్లాడుతూ ఆగస్టు 1టవ తారీకు న భారతదేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఎస్సీ ఎస్టీలకు వర్గీకరణ తోనే అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని ఏడుగురు జడ్జీల అత్యున్నత ధర్మాసనం తీర్పు ఇవ్వడం ఎస్సీ ఎస్టీ లలోని చిన్న తెగలు ఉపకులాలకు వారి గా జనాభా నిష్పత్తి ప్రకారం సామాజిక న్యాయం అన్ని రంగాలలో సమన్యాయం జరుగుతుందని హర్షం వ్యక్తం చేస్తూ ఆదివాసి పల్లెలు గ్రామాలు,గూడాలు నాయక పోడ్ తెగను, ఆదివాసీల ఐక్యత - చైతన్యం రాజ్యా ధికారం అనే ఎజెండా తో అణగారిన వర్గాల ప్రజలను చైతన్యం చేయుటకు వెంకటాపురం మండల నాయకపోడ్ దెబ్బ మండల ఇంఛార్జ్ గా బానారి సమ్మయ్యనాయకపోడ్ తో మండల ముఖ్య బాధ్యు లను అధికారిక కమిటీని ప్రకటించారు. నాయకపోడ్ దెబ్బ మండల కోఆర్డినేటర్‌గా ఇండ్ల లక్ష్మీనారా యణనాయక పోడ్,ఆర్గనైజింగ్ కన్వీనర్‌గా ఉమ్మడి నరసింహనాయక పోడ్,సోషల్ మీడియాఇంఛార్జ్ గా భానారి సురేష్ నాయక పోడ్,ను నియమిస్తూ ఉత్తర్వులు జారీచేయడం జరిగింది.బానారి సమ్మయ్యనాయకపోడ్ మాట్లాడుతూ షెడ్యూల్ తెగలలో విద్య ఉద్యోగ ఉపాధి సంక్షేమ రంగాలలో సమ న్యా పోరాటంలో నన్ను నాయకపోడ్ దెబ్బ కార్యకర్త నుండి నాయకునిగా తయారు చేసిన నాయకపోడ్ దెబ్బ వ్యవస్థాపక అధ్యక్షులు దబ్బ సుధాకరన్ననాయకపోడ్ నాయకపోడ్ దెబ్బ వ్యవస్థా పక కో ఆర్డినేటర్ దళిత రత్నలి అవార్డు గ్రహీత నెమలి నర్సయ్యమాదిగ కృతజ్ఞతలు తెలిపారు.



# పరామర్శ

**రామడుగు,డిసెంబర్ 20(పిసిడబ్ల్యూ న్యూస్):** రామడుగు మండలం గోపాల్ రావు పేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు పూడూరి బాలరాజు గత ఐదు రోజులుగా హాట్ ప్రాబ్లం తో హాస్పిటల్లో చికిత్స చేసుకొని ఇంటికి వచ్చిన విషయం తెలుసుకొని వారి ఇంటికి వెళ్లి బాలరాజు పరామర్శించిన మాజీ శాసన సభ్యులు సుంకే రవిశంకర్ ఆయన వెంటకొండగట్టుదేవస్థానం డైరెక్టర్ రాజేందర్ రెడ్డి అంబేద్కర్ సంఘం అధ్యక్షులు రేణికుంట అశోక్ పాల్గొన్నారు.

# ప్రధానం వేడుకల్లో ములుగు జిల్లా జడ్పీ చైర్మన్, ములుగు నియోజకవర్గ బిఆర్ఎస్ ఇంచార్జి బడే నాగజ్యోతి





**ములుగు, డిసెంబర్ 20 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఈరోజు ములుగు జిల్లా వెంకటాపురం కేంద్రంలోని ప్రథనం వేడుకలో యెట్టి బాబురావు కూతురు హారిక వెడ్స్ సాయినాథ్ ప్రథనం వేడుకలో పాల్గొన్న ములుగు జిల్లా మాజీ జడ్పీ చైర్మన్ ములుగు నియోజకవర్గం బి ఆర్ ఎస్ పార్టీ ఇంచార్జి బడే నాగజ్యోతి నూతన వధూవరులను అక్షంతలు వేసి ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో ఏటూరునాగారం మండల అధ్యక్షులు సునీల్ కుమార్ ఖాజాపాషా తుమ్మ మల్లారెడ్డి మాదరి రామయ్య ఆత్మ కమిటీ చైర్మన్ దుర్గం రమణయ్య కన్నాయి గూడెం మండల అధ్యక్షులు సుబ్బుల సమ్మయ్య సిలుముల రాంబాబు కావిరి నర్సింహా రావు గోస్కుల రాంబాబు సిలుముల ప్రవీణ్ కావిరి అంజన్ రావు సునీల్‌రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం ఎమ్మెల్యేకు పాలాభిషేకం

**• మంగళవారిపేట మాజీ ఎంపీటీసీ మూడు ఫుల్ సింగ్ • గ్రామపార్టీ అధ్యక్షుడు బొమ్మగాని నవీన్ గౌడ్ ఆధ్వర్యంలో**



**నర్సంపేట, డిసెంబర్ 20 (పీసీడబ్ల్యూ న్యూస్):** కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు మేనిఫెస్టోలో పెట్టిన సన్న వడ్లకు క్వింటా ఒక్కంటికి 500 రూపాయలు బోనస్ ఇస్త అన్నట్టుగానే ఇచ్చిన మాట ప్రకారం బోనస్ పడటంతో కాంగ్రెస్ నేతలు సీఎం, ఎంఎల్ఏ కు పాలాభిషేకం చేశారు.అలాగే ఎంఎల్ఏ ఇచ్చిన మాట ప్రకారం మంగళవారిపేట గ్రామానికి కూడా తొందరలోనే రైతుల భూములకు పట్టాలు మరియు రుణ మాఫీ చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమములో మండల పార్టీ అధ్యక్షుడు శాఖమూరి హరిబాబు, గ్రామ పార్టీ అధ్యక్షుడు బొమ్మగాని నవీన్ గౌడ్, మాజీ ఎంపీటీసీ మూడు పూలుసింగ్, పులిగిల్ల నాగరాజు, రాగం కొమురయ్య, చెన్నబోయిన లింగయ్య,రాగం మల్లేష్, మచ్చ వెంకన్న, ఎద్దు కుమారస్వామి ఎర్ర స్వామిదాస్, బైరు సునీల్, కట్ల లింగయ్య, అబ్బాడి ఇంద్రారెడ్డి, మూడు వెంకన్న, మూడు మురళి,బానోత్ చంద్రు, కావాటి యాకేష్, ఎద్దు చిన్న మల్లేష్,బొచ్చు రాజన్న,ఎద్దు మహేష్,భూషబోయిన తిరుపతి,నాయకులు మరియు రైతులు సంతోషం వ్యక్తం చేశారు

# గంగుల కమలాకర్ దిష్టిబొమ్మను దహనం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం

**● బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై కేసు నమోదు చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం ● బిఆర్ఎస్ పార్టీ నగర శాఖ అధ్యక్షులు చల్లా హరిశంకర్...**



**కరీంనగర్ టౌన్, డిసెంబర్ 20(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ శాసనసభ్యులు గంగుల కమలాకర్ దిష్టిబొమ్మను దహనం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, అదేవిధంగా బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై కేసు నమోదు చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని బిఆర్ఎస్ పార్టీ నగర శాఖ అధ్యక్షులు చల్లా హరిశంకర్ అన్నారు. నేడు నగరంలోని 37వ డివిజన్లో మీకోసం కార్యాలయంలో బిఆర్ఎస్ పార్టీ నాగర శాఖ అధ్యక్షుడు చల్లా హరిశంకర్ ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చల్ల హరిశంకర్ మాట్లాడుతూ నిన్న అసెంబ్లీలో రాష్ట్ర మంత్రి పొన్నంప్రభాకర్ మరియు కరీంనగర్ శాసనసభ్యులు గంగుల కమలాకర్ కు మధ్య జరిగిన చర్చ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీకి చెందినవారు అసెంబ్లీలో జరిగిన చర్చను రాజకీయం చేస్తూ.. మంత్రి దగ్గర మెప్పు పొందాలని కరీంనగర్ శాసనసభ్యులు గంగుల కమలాకర్ దిష్టిబొమ్మను దహనం చేయడానికి తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు... ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడాన్నిబట్టి చూస్తే.. కాంగ్రెస్ వాళ్లు అధికారంలో ఉన్నారా... ప్రతిపక్షంలో ఉన్నారా... అనే అనుమానం ప్రజలకు తలెత్తుందని అన్నారు. కరీంనగర్ శాసనసభ్యులు ఓటమెరుగని నాయకుడని కౌన్సిలర్ గా, కార్పొరేటర్ గా, ఎమ్మెల్యేగా, ప్రజల మన్నలను పొందాడని.. వారన్నారు అదేవిధంగా బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు బీసీ గురుకుల పాఠశాలలకు ఎన్నో సేవలు చేశారని, అదేవిధంగా కరీంనగర్ నియోజకవర్గానికి ఎన్నో కోట్ల రూపాయలు తెచ్చి కరీంనగర్ నియోజకవర్గం అభివృద్ధి చేశారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుంభకోణాలు అవినీతి బయట పెట్టినందుకే బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై ఈ రేస్ కేసు కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యకు పాల్పడుతుందని, వారిపై నమోదు చేసిన కేసే ఇందుకు నిదర్శనం అన్నారు. కాంగ్రెస్ పార్టీ హామీలు అమలు చేయడంలో విఫలం చెందిందని, దాని నుండి ప్రజల దృష్టి మరల్చడానికి ప్రజల పక్షన పోరాడుతున్నటువంటి బిఆర్ఎస్ నేతలపై కక్ష సాధింపు ధోరణితో కేసులు పెడుతున్నారని అన్నారు. కేటీఆర్ పై నమోదు చేసిన కేసు ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలి అని డిమాండ్ చేసిన బిఆర్ఎస్ పార్టీ నగర అధ్యక్షులు, ఈ కార్యక్రమంలో నగర పార్టీ ప్రధాన కార్యదర్శి గడ్డం ప్రశాంత్ రెడ్డి, మైనార్టీ శాఖ కార్యదర్శి వాజిద్, యూత్ సెక్రటరీ సాయి, కరీంనగర్ నియోజకవర్గం యూత్ సెక్రటరీ గంగాధర చందు, డివిజన్ అధ్యక్షులు చేతి చంద్రశేఖర్, ఆరే రవి, జల్లోజి శ్రీనివాస్ నాయకులు సత్తినేని శ్రీనివాస్, ఒడ్నాల రాజు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## వాసవి క్లబ్ శాతవాహన నూతన అధ్యక్షునిగా ఎన్నిక



**గంగాధర, డిసెంబర్ 20 (పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా వాసవి క్లబ్ శాతవాహన కరీంనగర్ వారు 2025 సంవత్సరానికి గాను నూతన అధ్యక్షునిగా శ్రీ ఎలగందుల మునీందర్ , ప్రధాన కార్యదర్శిగా శ్రీ వొళ్లాల సత్యనారాయణ , కోశాధికారిగా శ్రీ తోడుపునూరి విశ్వనాథం ఎన్నిక కాబడినారు. వారు వారి యొక్క రీజినల్ చైర్ పర్సన్ శ్రీ పాత రాధాకృష్ణ కి వారి యొక్క ఎన్నిక పత్రం సమర్పించడం జరిగినది.వైస్ గవర్నర్ 2 ఎల్లంకి ప్రదీప్, జోన్ చైర్ పర్సన్ శ్రీ పోకల లక్ష్మీనారాయణ , రీజనల్ సెక్రటరీ శ్రీ జిల్లా వేణుగోపాల్, క్యాబినెట్ జాయింట్ కోశాధికారి శ్రీ సముద్రాల అంజనీ ప్రసాద్ విచ్చేసి కార్యక్రమం విజయవంతం

## జగిత్యాలలో ఎల్.ఐ.సి. ఎ.వో.ఐ. ఆవిర్భావ దినోత్సవ వేడుకలు...

**● జెండా ఎగుర వేసిన రాజు కుమార్**

**● సంస్థ అభివృద్ధికి కృషి చేస్తాం... ఏజెంట్స్ సమస్యలపై పోరాడుతాం**



**జగిత్యాల జిల్లా, డిసెంబర్ 20 (పీసీడబ్ల్యూ న్యూస్):** జగిత్యాల జిల్లా కేంద్రంలోని గొల్లపల్లి రోడ్డులో గల భారతీయ జీవిత భీమా సంస్థ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఉదయం ఎల్.ఐ.సి. ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జగిత్యాల శాఖ అధ్యక్షులు ఆమందు రాజు కుమార్ ఆధ్వర్యంలో సంఘం యొక్క జెండా ఎగుర వేసి, స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ఎల్.ఐ.సి. ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఆవిర్భావం, ఇప్పటి వరకు సాధించిన విజయాలు, చేస్తున్న కృషిని వివరించారు. ఈ సందర్భంగాసంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ భారతీయ జీవిత భీమా సంస్థ అభివృద్ధి కోసం కృషి చేస్తామని అన్నారు. ఏజెంట్ల సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేసి పరిష్కారాలు సాధిస్తామని తెలిపారు. ఈ మధ్య కాలంలో సంస్థ ద్వారా జరిగిన మార్పులపై పాలసీ దారులకు, ఎజెంట్ల కు తగు న్యాయం జరగాలని ఇన్సూరెన్స్ రెగ్యు లారిటీ డెవలాప్ మెంట్ ఆర్గ నైజేశన్ ఆప్ ఇండియా నిబంధనల ప్రకారం పోరాటం, ఉద్యమాలు కొనసాగుతున్నాయని వివరించారు. ఈ కార్య క్రమంలో ప్రధాన కార్యదర్శి రేగొండ లక్ష్మి కాంతం, కోశాధి కారి మహంకాళి ప్రభాకర్, చీఫ్ అడ్వైజర్ ఏనుగు గంగారెడ్డి, అడ్వయిజర్ చుక్క గంగారెడ్డి, ప్రతి నిధులు రౌతు నర్సయ్య, తాటిపెల్లి రాజిరెడ్డి, గొల్లపల్లి రాజేశం, చిలుక లక్ష్మి నారాయణ, ఏనుగు ఆనంద రెడ్డి, పుల్కం జలపతి, రాం. పూర్ శ్రీనివాస్, కాసారపు లక్ష్మి నారాయణ, జల్ద అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## గంగుల కమలాకర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన బిఆర్ఎస్ నాయకులు....



**కరీంనగర్, డిసెంబర్ 20 (పీసీడబ్ల్యూ న్యూస్):** అసెంబ్లీలో ప్రశ్నిస్తే సమాధానం చెప్పలేని కాంగ్రెస్ నాయకులు ఓటమెరుగని నాయకుని దిష్టిబొమ్మ దహనం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని నగర బిఆర్ఎస్ అధ్యక్షులు చల్ల హరిశంకర్ అన్నారు. నేడు బిఆర్ఎస్ పార్టీ నగర శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ చౌక్ లో కరీంనగర్ శాసనసభ్యులు గంగుల కమలాకర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ సందర్భంగా చల్ల హరిశంకర్ మాట్లాడుతూ.. కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ నిన్న అసెంబ్లీలో బీసీ గురుకుల విద్యార్థులపై సమస్యలపై చర్చించినప్పుడు, సమాధానాన్ని చెప్పలేక..కాంగ్రెస్ ప్రభుత్వం నాయకులు దిష్టి బొమ్మ నాటకం ఆడిందని ఎద్దేవా చేసారు. మొదటిసారి ఎమ్మెల్యేగా గెలిచిన వాళ్లను మొదటి ఎమ్మెల్యే అనక ఏమంటారో వాళ్ళకే తెలియాలన్నారు.కరీంనగర్ నియోజకవర్గంలో నాలుగు సార్లు కాంగ్రెస్ పార్టీ ఓడిపోయిందని.. 2020లో కార్పొరేషన్ ఎన్నికల్లో లో ఒక్క కాంగ్రెస్ కార్పొరేటర్ కూడా గెలవలేదని... దమ్ముంటే కరీంనగర్ లో గంగుల కమలాకర్ పై పోటీ చేసి గెలవాలని సవాల్ విసిరారారు. దమ్ముంటే కరీంనగర్ నగరానికి 500 కోట్లు నిధులు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చి నగరం అభివృద్ధి చేయాలని సవాల్ విసిరారు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు వారిని విడిచిపెట్టి ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షులు చల్ల హరిశంకర్ తో పాటు, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్ కుమార్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేణి మధు, కార్పొరేటర్లు దిండిగాల మహేష్ తోటరాములు, బోనాల శ్రీకాంత్ ఐలేందర్ యాదవ్ టిఆర్ఎస్ పార్టీ నగర ప్రధాన కార్యదర్శి గడ్డం ప్రశాంత్ రెడ్డి బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు బిఆర్ఎస్ పార్టీ డివిజన్ ఇన్చార్జులు బిఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## నగరంలో ఘనంగా సంత్ గడ్గే బాబా 68వ వర్ధంతి వేడుకలు...

**● త్వరలో కరీంనగర్‌లో సంత్ గడ్గే బాబా విగ్రహం ఆవిష్కరణ... ● రజక సంఘం నాయకులు...**



**కరీంనగర్, డిసెంబర్ 20 (పీసీడబ్ల్యూ న్యూస్):** సంత్ గడ్గే బాబా మహరాజ్ 68 వ వర్ధంతిని పురస్కరించుకొని రజక సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం రోజున నగరంలోని బోయవాడ వీధి, ఎల్ఐసి ఆఫీస్ చౌరస్తా వద్దగడ్గే బాబా చిత్రపటానికి పూలదండ వేసి వారికి ఘన నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా మన రజక సంఘం జాతీయ కోఆర్డినేటర్ కొల్లూరు మల్లేశ్ కుమార్ మాట్లాడుతూ సంత్ గడ్గే బాబా గొప్ప సంఘ సంస్కర్త, అని డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ సహచరులు, సమాజం లోని మూడ ఆచారాలను రూపుమపుటకు,పేదలకు విద్య అందించుటకు అనేక విద్యాలయా లు వసతి గృహాలు వారు నెలకొల్పడం జరిగిందని అన్నారు.శుచి శుభ్రత కోసం స్వయంగా వీధులు ఊడ్చి , తన కీర్తనలతో జాతిని జాగృతం చేసి చైతన్యం కలిగించిన మహానుభావులు వారి వర్ధంతి ప్రతి ఒక్కరూ జరుపాలని,వారు రజక దోబీ కులస్థులు ఐనా కానీ సమ సమాజ నిర్మాణానికి వెలుగు చూపిన గాడ్గె మహారాజ్, రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ భీంరావు అంబేద్కర్ కి అంత్ర్యంత సన్నిహితులు అని అన్నారు.గడ్గె బాబా పండరి పూర్ ఇతర ప్రదేశాల్లో వారి ట్రస్ట్ ద్వారా నిర్మించిన భవనాలు చివరి దశలో అంబేద్కర్ ద్వారా నడిచే ట్రస్ట్ కు వారి చేతి ముద్రతో ఇచ్చి గొప్పగా కార్యక్రమాలు చేపట్టారు అని బాబా మహరాజ్ చేసే సమాజ పరిణామ క్రమంను ఆకలిపు చేసుకున్న మహాత్మ గాంధీ ముగ్ధులు అయి వారిని చాల ప్రశంసించారు. సంత్ గడ్గె బాబా పేరు తో యునివర్సిటీ అమరావతి జిల్లాలో మహారాష్ట్ర లో గొప్పగా ఉన్నది అని అన్నారు.భారత దేశంలో,విదేశాల్లో బాబా వర్ధంతి కి నివాళులు, జయంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తారు.కరీంనగర్ పట్టణంలొ త్వరలోనే సంత్ గడ్గె బాబా మగరాజ్ విగ్రహం నెలకొల్పి ఘనంగా జయంతి వేడుకలు జరుపాలని కోరారు.ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు మైకేల్ శ్రీనివాస్, దుద్దెల శ్రీధర్, కొత్తకొండ శ్రీనివాస్,డి ప్రశాంత్, బిజిగిరి నవీన్ కుమార్,నారాయణ,కొమరయ్య,లక్మన్,రమేష్,రవి, బి ఎం ఎస్ జిల్లా కార్యదర్శితోర్తి శ్రీనివాస్,బాలయ్య, లింగమూర్తి కనకయ్య మల్లయ్య ,జక్కన్ సంపత్, కొత్తకొండ రవి, కాళిదాసు అరుణ్ తదితరులు పాల్గొన్నారు.



## బదిలీ పైన వెళ్లినా ఉపాధ్యాయునికి ఘనంగా సన్మానం



**కరీంనగర్ జిల్లా ప్రతినిధి, డిసెంబర్20(పీసీడబ్ల్యూ న్యూస్):** మానకొండూర్ నియోజక వర్గంలో ని బెజ్జంకి మండలంలోని మండల ప్రాథమిక పాఠశాల లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన గత కొన్ని సంవత్సరాల నుండి సుదీర్ఘంగా పిల్లలకు విద్యాబ్యాసాన్ని అందించి నేడు బదిలీ పై వెళ్లినా ప్రధానోపాధ్యాయులు కల్లూరి నర్సింహులు కు పాఠశాల నూతన ప్రధానోపాధ్యాయులు షాబోద్దీన్ మరియు ఉపధ్యాయురాలు సునీతా మరియు స్కూల్ పాఠశాల యాజమాన్య కమిటీ మరియు విద్యార్థులు వారి తల్లిదండ్రులు వారిని ఘనంగా సన్మానం చేయడం జరిగింది... బదిలీపైనా వెళ్లినా మాస్టర్ నర్సింహులు తన ఉపన్యాసం ఇస్తూఉంటే పిల్లలందరు ఎక్కడలేనటువంటి సంతోషాన్ని వారి చప్పట్లు తో మాస్టర్ ఉపన్యాసం ముగించే వరకు వారి ఆనందాన్ని వెలిబుచ్చారు...సార్ మీరు ఎక్కడికి వెళ్ళకండి..ఇక్కడే ఉండండి అంటూ విద్యార్థులు కంటతడి పెట్టారు. ఈ ఆత్మీయ వీడ్కోలు సమావేశానికి ముఖ్య అతిథి గా హాజరైనా స్థానిక కాంప్లెక్స్ హెడ్ మాస్టర్ గోపాల కృష్ణ .వీరితో పాటు ఉపాధ్యాయులు శ్రీనివాస్ సతీష్ రామంచ రవీందర్ బోనాల రాజేందర్ మరియు స్థానిక ప్రజాప్రతినిధులు మాజీ సర్పంచ్ ముక్కిస తిరుపతి రెడ్డి మాజీ యం.పి.టి.సి ముక్కిస తిరుపతి రెడ్డి మరియు మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పాకాల మహిపాల్ రెడ్డి మరియు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా వారియర్స్ లింగాల అర్జున్ అంగన్వాడీ టీచర్ వెంకట లక్ష్మి కార్యదర్శి అనూష మరియు పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు మరియు పిల్లల తల్లిదండ్రులు మరియు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## 23న కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయండి

**● పరంపోగు భూములను గూడులేని పేదలకు ఇండ్ల స్థలాలకు కేటాయించాలి ● రెవిన్యూశాఖ సర్వేయర్ల నిర్లక్ష్యానికి వైఖరికి ముట్టడి వాల్ పోస్టర్ ఆవిష్కరణ ● అంబేడ్కర్ యువజన సంఘం అద్యక్షులు, మొలంగూర్ గ్రామ శాఖ**



**కరీంనగర్ జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 20(పీసీడబ్ల్యూ న్యూస్):** ఈ రోజు కరీంనగర్ ప్రెస్ క్లబ్‌లో అంబేద్కర్ యువజన సంఘం మొలంగూర్ గ్రామ శాఖ అధ్యక్షులు మాట్లాడుతూశంకరపట్నం మండలం మొలంగూర్ గ్రామ శివారు సర్వే నెం. 703 లో 15 ఎకరాల 32 గుంటలు సర్వే నెం. 378 లో 6 ఎకరాల ఇ2 గంటల పరంపోగు భూమిలో SC, ST, BC, మైనార్టీలకు సంబంధించి భూమినీ అందరు భూస్వాములు ఎకరాల్లో ఆక్రమించి ఖబ్జా చేసివారు. ఇట్టి మిగులు భూమిని సర్వే చేయించి SC, ST, BC, మైనార్టీలకు చెందిన గూడు లేని నిరుపేదలకు ఇండ్ల స్థలాల కింద కేటాయించాలని పౌరహక్కుల దినోత్సవం సంద్భంగా తహసిల్దార్ కు పిర్యాదు చేయడం జరిగింది. జిల్లా పాలనాధికారికి కూడా పిర్యాదు చేయడం జరిగింది. ఇట్టి పిర్యాదుపై రెవన్యూ భు శాఖ సర్వేయర్లు తూతూ మంత్రంగా నామమాత్రపు తనిఖీలు చేస్తూ కాలయాపన చేస్తునారు తమే సర్వే నిర్వహించి గూడులేని నిరుపేదలకు ఇందిరమా ఇండ్ల స్థలాల కింద మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ కానీ ఈ నెల 23 న జరుగు కలెక్టరేట్ ముట్టడి కార్య క్రమానికి అంబేడ్కర్ యువజన సంఘాలతో పాంటు SC, ST, BC, మైనార్టీల కుల సంఘాలు మరియు అన్ని రాజకీయ పార్టీలు కలిసి వచ్చి విజయయతం చేయాలని పిలుపునిచ్చారు .ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు కొరపెల్లి శివప్రసాద్, గాజుల. శ్యామ్, మోరే గోపికృష్ణ దాసారపు. శివస్వామి, దాసారపు. నరేష్, కాలేని, సమ్మయ్య, కాసర్ల, కొమ్మరయ్య నెలవేణి రమేష్, తదితరులు పాల్గొనారు.

## రాష్ట్రపతితో పరిచయ కార్యక్రమంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి...



**కరీంనగర్ జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 20 (పీసీడబ్ల్యూ న్యూస్):** భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్మ శీతాకాల విడిది కోసం హైదరాబాద్ వచ్చిన సందర్భంగా సికింద్రాబాద్ లోని రాష్ట్రపతి నిలయంలో ఏట్ హోమ్ కార్యక్రమం లో పాల్గొని భారత రాష్ట్రపతితో పరిచయ కార్యక్రమంలో పాల్గొన్న సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి.

# ప్రభుత్వ షాపింగ్ కాంప్లెక్స్ స్వాధీనం చేసుకోవడానికి అభ్యంతరం ఎందుకో..?

**● సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలి**

**● సమాచార హక్కు సాధన సమితి జిల్లా కన్వీనర్ గగన్**

**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా,డిసెంబర్ 20,(పిసిడబ్ల్యూ న్యూస్):** మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గం కాప్రా సర్కిల్ ఏఎస్ రావు నగర్ డివిజన్ పరిధిలోని జై జవాన్ కాలనీ షాపింగ్ కాంప్లెక్స్ నుస్వాధీనం చేసుకోకుండా దోబూచులాడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని సమాచార హక్కు సాధన సమితి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కన్వీనర్ తాడూరి గగన్ కుమార్ కోరారు. ఈ మేరకు శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలనలో భాగంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. ఈ విషయమై గతంలో ప్రజావాణి కార్యక్రమానికి ఫిర్యాదు చేస్తే సంబందిత అధికారులు స్పందించి షాపింగ్ కాంప్లెక్స్ ను స్వాధీనం చేసుకుంటామని హామీ ఇచ్చారని, ప్రస్తుతం కల్లబొల్లి కబుర్లు చెబుతూ మాటలు చెబుతూ దాటవేస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఉప్పల్ నియోజకవర్గ కాప్రా సర్కిల్ డాక్టర్ ఏఎస్ రావునగర్ డివిజన్ పరిధిలోని జై జవాన్ కాలనీలో 2013లో అప్పటి ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి



నియోజకవర్గ అభివృద్ధి నిధులతో నిర్మించబడిన షాపింగ్ కాంప్లెక్స్ లో 10 కమర్షియల్ షెటర్స్ పై అద్దె రూపంలో వస్తున్న ఆదాయం జిహెచ్ఎంసి కాప్రా సర్కిల్ కోల్పోతుందని ఆయన తెలిపారు. ఈ విషయమై గతంలో ఫిర్యాదు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. దీంతో ఎల్బీనగర్ జోనల్ కార్యాలయం నుంచి తక్షణమే కాప్రా సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ ద్వారా జై జవాన్ కాలనీ వారి నుండి 10 షాపింగ్ కాంప్లెక్స్‌ను స్వాధీనం చేసుకునేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారని అన్నారు. ఈ విషయంలో తదుపరి నివేదికను జిహెచ్ఎంసి ఎస్టేట్ ఆఫీసర్ కు సమర్పించాలని సూచించినట్లు తెలిపారు. నాటి నుంచి నేటి వరకు జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ అధికారులు జై జవాన్ కాలనీలోని 10 కమర్షియల్ షట్టర్లను స్వాధీనం చేసుకోవడంలో అనేక రకాల కారణాలు చెబుతూ వాయిదా వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు ఆదేశించి రెండు నెలలు కావస్తున్నప్పటికీ అధికారులు చర్యలు తీసుకోకపోవడం పట్ల ప్రజావాణిలో ఫిర్యాదు చేసినట్లు గగన్ కుమార్ పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్తిని కాపాడాలని, తద్వారా వస్తున్న అద్దె రూపం లో వచ్చే ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని ఆయన కోరారు. నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి నిర్మించిన కమర్షియల్ షాపింగ్ కాంప్లెక్స్‌కు సుమారు రూ.50 నుంచి 60 వేలు వస్తాయి అని తెలిపారు. గత 11 సంవత్సరాల నుండి జిహెచ్ఎంసి కోల్పోతున్న ఆదాయాన్ని ఇప్పటికైనా కాపాడుకోవాలని ఆయన సూచించారు. ఈ మేరకు గత ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన ధ్రువీకరణ పత్రాలతో పాటు కాప్రా డిప్యూటీ కమిషనర్ పంపిన లేఖతో ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జోక్యం తీసుకొని తక్షణమే షాపింగ్ కాంప్లెక్స్ స్వాధీనం చేసుకోవాలని ఆయన కోరారు.

# ఐటీఎం యూనివర్సిటీ బ్రాంచ్ ప్రారంభోత్సవం

**● ప్రారంభించిన యూనివర్సిటీ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ డా. రవి శర్మ**



**వరంగల్ ప్రతినిధి డిసెంబర్ 20 (పిసిడబ్ల్యూ న్యూస్):** మన తెలంగాణ వరంగల్ హనుమకొండ మధ్యప్రదేశ్ లోని ఐటీఎం యూనివర్సిటీ 2025–2026 అకాడమీ సంవత్సరం కోసం అందరు గ్రాడ్యుయేట్ పోస్ట్ గ్రాడ్యుయేట్ డాక్టర్ ప్రోగ్రామ్స్ కోసం అడ్మిషన్స్ పొందేందుకు తెలంగాణ రాష్ట్రంలోని ఉమ్మడి వరంగల్ జిల్లాలో పేద మధ్యతరగతి విద్యార్థుల కోసం పై చదువులు చదివేందుకు మొట్టమొదటిసారిగా హనుమకొండ లో ఐటీఎం యూనివర్సిటీ వారి ఆధ్వర్యంలో అడ్మినిస్ట్రేషన్ బ్రాంచ్ ఓపెన్ చేయడం జరిగింది. శుక్రవారం ఐ టి ఏం బ్రాంచ్ ప్రారంభించడానికి యూనివర్సిటీ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ డా. రవి శర్మ, స్మార్ట్ ఛాయిస్ ఎడ్యుకేషనల్ సర్వీస్సి ఈ ఓ కృష్ణ ముఖ్య అతిధులు గా పాల్గొని ప్రారంభించారు. అనంతరం వరంగల్ బ్రాంచ్ డైరెక్టర్ బుర్ర సురేష్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ డాక్టర్ రవి శర్మ కి స్మార్ట్ ఛాయిస్ ఎడ్యుకేషనల్ సర్వీస్సి ఈ ఓ కృష్ణ కి శాలువాతో సన్మానించి బొకే అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మీడియాతో యూనివర్సిటీ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ డాక్టర్ రవి శర్మ మాట్లాడుతూ...ఐటీఎం యూనివర్సిటీలో దేశవ్యాప్తంగా పేద మధ్యతరగతి విద్యార్థులు విద్యనభ్యసించారని అన్నారు. ఐటీఎం యూనివర్సిటీలో ఇంజనీరింగ్, ఎంబిబిఎస్, బీఎస్సీ నర్సింగ్, ఎంబీఏ ఎంసీఏ తదితర కోర్సులు అందుబాటులో ఉన్నాయని వాటితో పాటుగా, ఈ సంవత్సరంలో కొత్తగా ఏఎల్ ఎం కోర్స్ అందుబాటులో కి తీసుకు రావడం జరుగుతుందని తెలిపారు. 18 సంవత్సరాల కాలంలో ఐటీఎం యూనివర్సిటీలో చదివిన విద్యార్థులు 4000 మంది వివిధ రంగాలలో ఉద్యోగాలు సాధించారని అధిక వేతనం పొందుతున్నారని అన్నారు. ఈ యూనివర్సిటీ లో విద్యనే కాకుండా వైద్య పరంగా పేరు గాంచిందని తెలిపారు. ఈ యూనివర్సిటీలో చదివే విద్యార్థులకు అతి తక్కువ ఉంటాయని అన్నారు. ఈ యూనివర్సిటీలో దాదాపు 1000 మంది ఫారెన్ స్టూడెంట్లు కూడా ఉన్నారని, గతంలో 1000 మందికి పైగా విద్యార్థులు విద్యను అభ్యసించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్ బ్రాంచ్ డైరెక్టర్ బుర్ర సురేష్ గౌడ్, బ్రాంచ్ సిబ్బంది రమేష్,సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# పాత గన్ని బస్తాలతో రైతులు,హమాలీలకు ఇబ్బందులు

**● సిసిఐ ఇస్తున్న కొత్త గన్ని బస్తాలు ఎటుపోయాయి...**



**బయ్యారం, డిసెంబర్ 20(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్రంలో సీసీఐ, మండలాల సొసైటీల ద్వారా, ఐకెపిల ద్వారా రైతు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తున్న క్రమంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ, అధికారిక సివిల్ సప్లై ల ద్వారా రైతు పండించిన ధాన్యాన్ని మార్కెట్ కేంద్రాలలో కొనుగోలు చేసే క్రమంలో కొత్త గన్ని బస్తాలు ధరను నిర్ణయించి ఆయా మార్కెట్ వ్యవస్థలకు ఇస్తుంది. ఈ ప్రక్రియ నిరంతరం సాగుతూనే ఉంటుంది. కానీ ప్రస్తుతం ఏ కొనుగోలు కేంద్రాల వద్దనైనా కొత్తగా గన్ని బస్తాలు చూసిన దాఖలాలు లేవు అంటూ రైతుల ఆరోపణలు ఉంటున్నాయి.



మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలోని రైతుల ధాన్యం కొనుగోలు కేంద్రాలు 17 ఉన్నాయి. వాటిలో సొసైటీ 10,ఐకెపి సెంటర్లు 07 నిర్వహిస్థున్నారు. కొనుగోలు సెంటర్లో రైతుల ధాన్యం ఆరబోసి తాలు, మట్టి లేకుండా జల్లెడ పట్టి కొనుగోలు నిర్వాహకులు రైతుల ధాన్యం సేకరిస్తున్నారు.గత కొన్ని రోజులుగా సెంటర్లకు పాత గన్ని బస్తాలను పంపించడం వలన వాటిలో 60 శాతం బస్తాలు చిరిగిపోయి ధాన్యం పోయడానికి వీలు లేకుండా ఉండడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైతుల ధాన్యమును కాంటా పెట్టే సమయంలో పాత గన్నీలకు రంధ్రాలు ఉండటంతో వాటికి గడ్డి, చెత్త పెట్టి ధాన్యం నింపి లారీల ద్వారా ప్రభుత్వం ఆర్ ఓ ఆర్ తీసుకున్న మిల్లులకు పంపిస్తున్నారు.మిల్లర్లు చిరిగి పోయిన బస్తాలలో ధాన్యం నింపడంతో రంధ్రాల గుండా దాన్యము క్రిందకు పడి పోవడంతో మిల్లర్లు లారీ వే బ్రిడ్జి సందర్భాలలో తూకం తేడా వస్తుందేమోనని రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వము కొత్త గన్ని బ్యాగులను సరఫరా చేసి రైతుల నాణ్యమైన ధాన్యమును సేకరించే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు, హమాలీలు కోరుతున్నారు. కొన్ని సెంటర్లలో కొత్త గన్ని బ్యాగులు ఇచ్చి మరికొన్ని సెంటర్లో పాత గన్ని బ్యాగులను అధికారులు అందజేస్తున్నట్లు ఆరోపణలు వెలుబడుతున్నాయి. ఈ క్రమంలో కొత్త గన్ని బ్యాగుల ధర ను ప్రభుత్వం చెల్లించినప్పటికీ పాత గని బ్యాగులు రావడంలో ఆంతర్యం ఏమిటని పలువు రైతులు తమ సందేహాలను వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ ఇప్పటికైనా తక్షణమే కొత్త గన్ని బ్యాగులను కొనుగోలు కేంద్రాలకు చేర్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# ఓరియంట్ సిమెంట్ కర్మాగారం కార్మల్ గిరి పాఠశాలకు 44 సంవత్సరాల చరిత్ర

**● కార్మల్ గిరి పాఠశాలను ఓరియంట్ జ్ఞాన మందిర్‌గా పేరు మార్పిడి**

**● సిబిఎస్ సిలబస్‌కు మారిన పాఠశాల**




**కాసిపేట మండల ప్రతినిధి,డిసెంబర్ 20(పిసీడబ్ల్యూ న్యూస్):** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మారుమూల గ్రామమైన దేవాపూర్ లో ఓరియంట్ సిమెంట్ కర్మాగారం ఏర్పాటు చేసేందుకు 1979లో సర్వేను ప్రారంభించారు. సివిల్ పనులు ప్రారంభించే సమయంలో అప్పటి అధికారులకు,కాంట్రాక్టు కార్మికులకు, సివిల్ వర్కర్లకు కొన్ని తాత్కాలిక గృహాలను ఏర్పాటు చేశారు. తాత్కాలికంగా ఏర్పాటు చేసిన గృహాలలో హెచ్, టైపు, జి, టైపు, సివిల్ లేబర్ కొరకు ఈసీసీ బ్లాక్ లను ఏర్పాటు చేశారు. 1980లో కొందరు పర్మనెంట్ కార్మికులను కర్మాగారంలో విధులు నిర్వహించేందుకు తీసుకున్నారు. ఆ సమయంలో కర్మగారంలో విధులు నిర్వహిస్తున్న వారి పిల్లల విద్య కొరకు జీ, టైపు క్వార్టర్లలో 150 మంది విద్యార్థులు, పదవ తరగతి పాసైన ఐదు మంది ఉపాధ్యాయులను స్థానికంగా ఉన్న వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించారు. 1983 సంవత్సరంలో విద్యార్థుల సంఖ్య పెరిగిపోవడంతో జీ, టైపు క్వార్టర్ లో ఉన్న ఉద్యోగస్తులను ఖాళీ చేయించి ఐ,టైప్ ఏర్పాటు చేసి అందులోకి తరలించారు. విద్యార్థుల సంఖ్య పెరిగిపోవడంతో అప్పటి ఓరియంట్ వైస్ ప్రెసిడెంట్ పిఎన్ మహేశ్వరి ఉండగా పర్సనల్ మేనేజర్ ఎస్ ఎల్ ఎన్ మూర్తి పాఠశాలను అభివృద్ధి చేస్తూ అదే ప్రాంతంలో నూతన భవనాన్ని ఏర్పాటు చేసి కార్మల్ గిరి పాఠశాల సంస్థకు అప్పగించారు. మంచి విద్యను అభ్యసించిన స్థానిక ఉద్యోగుల వారి భార్యలకు అవకాశం కల్పిస్తూ ఇతర ప్రాంతాల నుంచి ఉపాధ్యాయులను ఎంపిక చేశారు.150 మంది విద్యార్థులతో ప్రారంభమైన పాఠశాల 2000 సంవత్సరం వరకు 1700 మంది విద్యార్థులు 67 మంది ఉపాధ్యాయులతో తెలుగు,ఇంగ్లీష్ మీడియం రెండు సెక్షన్లు విజయవంతంగా ఎంతో మంది విద్యార్థిని విద్యార్థులు విద్యను అభ్యసించారు. విద్యార్థుల సంఖ్య పెరిగిపోవడంతో మరో ప్రాంతంలో నూతన భవనాన్ని ఏర్పాటు చేసి పాత పాఠశాల నుంచి నూతన భవనానికి మార్చడం జరిగింది. కార్మల్ గిరి పాఠశాలలో విద్యను అభ్యసించిన ఎంతోమంది విద్యార్థిని,విద్యార్థులు ఉన్నత పదవులలో అమెరికా లాంటి దేశాలలో కూడా ఉద్యోగ అవకాశాలు దొరికిన ఎందరో మంది విద్యార్థులు ఈ పాఠశాలలో విద్యను అభ్యసించిన వారే. ఇదే పాఠశాలలో విద్యను అభ్యసించిన విద్యార్థినీ,విద్యార్థులు ఓరియంట్ సిమెంట్ కర్మాగారంలో ఉన్నత పదవుల్లో ఉద్యోగాలు చేసే వారు కూడా ఉన్నారు. ఇదే పాఠశాలలో ఉపాధ్యాయులుగా చేసేవారు ఉన్నారు. పాఠశాల పద్ధతుల్లో కొన్ని మార్పులు రావటంతో పాఠశాల పాత యాజమాన్యాన్ని బదిలీ చేస్తూ నూతన యాజమాన్యమైన కొత్తవారికి ఓరియంట్ జ్ఞాన మందిరిగా కొత్తవారికి అవకాశం ఇచ్చారు.ఓరియంట్ సిమెంట్ కర్మాగారం యజమాని చంద్రకాంత్ బిర్లా నుండి అదా నీ చేతిలోకి యాజమాన్యం మారుతున్న సమయంలో విద్యలో కూడా మార్పు చోటు చేసుకుంది. దేవపూర్ మరియు పరిసర గ్రామాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి ఓరియంట్ సిమెంట్ దేవాపూర్ వారి ఆధ్వర్యంలో నడుస్తున్న డి ఏ వి ఓరియంట్ జ్ఞాన మందిరం పాఠశాలకి ఇప్పటి ఉన్నతాధికారులు సిబిఎస్ పర్మిషన్ రావటంతో 23 క్లాస్ రూమ్లలో డిజిటల్ క్లాస్ రూములుగా మార్పు చేశారు. యూనిట్ హెడ్ బాల గిరిధర్ డిజిటల్ క్లాస్ రూమ్ లను ప్రారంభించారు. ఈ సందర్భంగా బాల గిరిధర్ ప్రసంగిస్తూ ఈ పాఠశాలకు సీబీఎస్ సిలబస్ రావటం ప్రతి క్లాస్ రూమ్ లో డిజిటల్ రూములుగా మార్చడం ఎంతో ఆనందించవలసిన విషయమని అన్నారు. ఇందులో విద్యను అభ్యసించే విద్యార్థిని విద్యార్థులు ఎంతో అదృష్టవంతులుగా భావిస్తున్నామని అన్నారు. ప్రస్తుతం పాఠశాలలో 1300 మంది విద్యార్థిని,విద్యార్థులు, 57 మంది ఉపాధ్యాయులతో ప్రస్తుతం పాఠశాల కొనసాగుతుంది.మారుమూల గిరిజన ప్రాంతమైన ప్రధాన పట్టణాలకు దీటుగా విద్యను బోధించే ఉపాధ్యాయులు ఉన్నారని మీరు మంచి విద్యను స్వీకరించి ఉన్నత పదవుల్లోకి వెళ్లాలని కోరుతున్నామని అన్నారు. సిబిఎస్ పర్మిషన్ లేఖను పాఠశాల ప్రధానోపాధ్యాయుడైన కిరణ్ కుమార్ కు అందజేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జిఎంహెచ్ఆర్ ఆనంద కులకర్ణి, పాఠశాల సిబ్బంది, కర్మాగారం హెచ్ఆర్ డిపార్ట్మెంట్ అధికారులు పాల్గొన్నారు. తమ పిల్లలకు ఇంతటి అవకాశాన్ని కల్పించిన ఓరియంట్ సిమెంట్ ఉన్నతాధికారులకు, సిబిఎస్ సిలబస్ ను తీసుకు వచ్చిన ప్రతి ఒక్క అధికారికి విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు అందజేస్తున్నారు.



# అనారోగ్యంతో పోరాడి ఓడిన మాజీ ఓరియంట్ కార్మికుడు

**● చికిత్స పొందుతూ మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో మృతి చెందిన సంజీవ్**



**కాసిపేట మండల ప్రతినిధి,డిసెంబర్ 25(పిసిడబ్ల్యూ న్యూస్):** ఓరియంట్ సిమెంట్ కర్మాగారంలో విధులు నిర్వహించిన మృతుడు గత కొంతకాలంగా అనారోగ్యంతో ఎన్నో అవస్థలు ఎదుర్కొంటున్నారు. విధులు నిర్వహించే పరిస్థితుల్లో లేకపోవడంతో తన భార్యకు ఉద్యోగ అవకాశం కల్పించాలని అధికారులను, నాయకులను కోరగా అతని ఆరోగ్య పరిస్థితిని గమనించి అతని భార్య దివ్య కు ఉద్యోగ అవకాశం కల్పించారు. గత ఆరు నెలలుగా ఓరియంట్ సిమెంట్ కర్మాగారంలో విధులు నిర్వహిస్తూ తన భర్తకు మంచి ట్రీట్మెంట్ ను అందిస్తున్నారు. వివరాలలోనికి వెళితే పాత మందమర్రి గ్రామానికి చెందిన బూనేని చంద్రయ్యకు ఓరియంట్ సిమెంట్ కర్మాగారంలో సిమెంట్ మిల్లు బెల్ట్ ఆపరేటర్ గా పర్మినెంట్ కార్మికుడిగా విధులు నిర్వహించాడు. బోనేని చంద్రయ్య మద్దిమాడ గ్రామంలో స్థిరా నివాసం ఏర్పాటు చేసుకున్నారు. అతని అనారోగ్య పరిస్థితి సమయంలో కర్మాగారం అధికారులు వారసత్వ ఉద్యోగాలు ఇచ్చే సమయంలో తనయుడు సంజీవ్ కు ఉద్యోగ అవకాశం కల్పించారు. గత కొన్ని సంవత్సరాలుగా ఉద్యోగం చేస్తూ అనారోగ్యానికి గురికావడం బాధాకరం. మృతునికి భార్య,ఇద్దరు తనయులు ఉన్నారు. మృతునికి ఓరియంట్ కర్మాగారంలో విధులు నిర్వహించే కార్మికులు ప్రగాఢ సానుభూతిని అందజేశారు.

# పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి శనివారం పర్యటన వివరాలు

**తొర్రూర్ ప్రతినిధి, డిసెంబర్ 20(పీసీడబ్ల్యూ న్యూస్):** పాలకుర్తి నియోజకవర్గం లోని పలు కార్యక్రమాలలో పాల్గొనున్న ఎమ్మెల్యే యశస్విని రెడ్డి.ఉదయం: 11:00 గంటలకు పెద్దవంగర పోచంపల్లి గ్రామంలో పాలకుర్తి నియోజకవర్గం లోని దేవాదుల భూ నిర్వాసితులకు ప్యాకేజ్ (6) ద్వారా నిధుల మంజూరి పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొంటా రు. మధ్యాహ్నం:12:00 గంటలకు పాలకుర్తి మండల కేంద్రంలో భాసరత్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్న మినీ క్రిష్మస్ వేడుకలలో పాల్గొం టారు.ఒక ప్రకటన ద్వారా ఈ విషయాలను వెల్లడించారు.

# ఎమ్మెల్యే గంగుల కమలాకర్ దిష్టిబొమ్మ దహనం



**రామడుగు, డిసెంబర్ 20 (పిసిడబ్ల్యూ న్యూస్):** మండల కేంద్రంలోని యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో కరీంనగర్ యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ముత్యం శంకర్ ఆదేశానుసారం యువజన కాంగ్రెస్ రామడుగు మండల అధ్యక్షులు అనూపురం పరశురామ్ గౌడ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి వర్యులు పొన్నం ప్రభాకర్ గౌడ్ పై అసెంబ్లీ సమావేశాల్లో చేసిన అనుచిత వ్యాఖ్యలు కు నిరసనగా రామడుగు మండల కేంద్రంలోఎమ్మెల్యే గంగుల కమలాకర్ దిష్టి బొమ్మను దహనం చేయడం జరిగింది యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి వినయ్,రామడుగు మండల ఉపాధ్యక్షులు పవన్ ,యువజన కాంగ్రెస్ సీనియర్ నాయకులు మామిడి దిలీప్ కుమార్,మల్యాల అక్షయ్,రాజశేఖర్ యువజన కాంగ్రెస్ నాయకులు పూరెల్ల రాహుల్,బసరవేని అజయ్, పొన్నంవిజయ్, సుమంత్,మహేష్,గణేష్, రాంప్రసాద్ ,తదితరులు పాల్గొన్నారు.



# రియాల్ ఎస్టేట్ బిల్డర్స్‌పై చర్యలు తీసుకోవాలి..!: చందనాల రమేష్



**పరకాల, డిసెంబర్ 20 (పిసిడబ్ల్యూ న్యూస్):** అక్రమంగా పట్టా భూమి నుంచి దారి చేసే ప్రయత్నం చేస్తున్న రియల్ ఎస్టేట్ బిల్డర్స్ పై చర్యలు తీసుకోవాలని చందనాల రమేష్.. కోరారు. హనుమకొండ ప్రకాష్ రెడ్డి పేటలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రమేష్ మాట్లాడుతూ.. హనుమకొండ... ప్రకాష్ రెడ్డి పేట మైత్రి నగర్ కాలనీలోని సర్వే నంబర్ 567 డి లోని గల పట్టా భూమి లో 2 లక్షల రూపాయలతో...నేను 20 రోజుల క్రితం 125 ఫిట్ల పొడవైనా హద్దు బంద్ బేస్ మెంట్ ను నిర్మించుకున్నాని... ఈ నెల 18 న తన భూమి వద్ద కు వెళ్లగా... హద్దు బంద్ బేస్ మెంట్ పూర్తి గా ధ్వంసం చేశారని, అక్రమంగా ద్వ%శీ%సం చేసి కూల్చిన దుండుగులపై అధికారులు చర్యలు తీసుకొని కఠినం శిక్షించాలని విజ్ఞప్తి చేశారు. బిల్డర్స్ మహిపాల్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి మరి కొందరు... తాము నిర్మించుకున్న ఇండ్లు అమ్ముడు పోవడం లేదని... వాళ్లు నిర్మించుకున్న భవనాలకు దారి దూరం అవుతున్నదని... నా భూమి గుండా పోతే మెయిన్ రోడ్డు దగ్గర అవుతుందని... దారి చేసుకునే ప్రయత్నం చేస్తున్నారని.. తెలిపారు. గోడ కూల్చిన దుండిగుల పై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినప్పటికీ... నా భూమి గుండనే నడిచే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఇట్టి విషయంపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# యువ నాయకత్వంతోనే నవ సమాజ నిర్మాణం సాధ్యం

- పట్ట భద్రుల ఎంఎల్‌సి అభ్యర్థి జనార్ధన్ న్యాంతాబాద్



**కరీంనగర్ జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 20(పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ లో ఈ రోజు భారీ ఎత్తున బైక్ ర్యాలీ తీసిన పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్థి జనార్ధన్ న్యాంతాబాద్... ర్యాలీ అనంతరం జనార్ధన్ మీడియాతో మాట్లాడుతూ యువత రాజకీయాల్లోకి రావలసిన అవసరం ఎంత గానో ఉంది అని. అందుకే తను ఒక యువ నాయకునిగా ముందుకు వచ్చానని.. ఈ రోజు ఉన్న నిరుద్యోగ సమస్యని అనుభవించిన వ్యక్తి గా.. తను నిరుద్యోగ సమస్యని తీర్చడానికి కృషి చేస్తానని.. G.O 29 రద్దు కి కృషి చేస్తానని.. ప్రభుత్వ ఉద్యోగులు 317 G.O వల్ల అనుభవిస్తున్న సమస్యలని శాసనమండలిలో గళం విప్పుతనని.. ప్రయివేట్ టీచర్స్ లెక్చరర్స్ ఉద్యోగ భద్రత కల్పించండం కోసం మరియు వారికి ఉద్యోగ భద్రత కల్పన కోసం కృషిచేస్తానని.. యువనాయకత్వం తోనే నవ సమాజ నిర్మాణం సాధ్యమని.. తనకి మొదటి (1)ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజారిటీ తో గెలిపించాలని కోరారు.

# హామీలు మరిపించటానికే తప్పుడు కేసులు

- కేటీఆర్‌పై చిల్లర కేసు.. విచారణలో అన్ని తేలుతాయ్ : జగదీశ్‌రెడ్డి

**హైదరాబాద్,డిసెంబర్ 20 (పీసీడబ్ల్యూ న్యూస్):** ప్రజలకు ఇచ్చిన హామీలను మరిపించడానికే కాంగ్రెస్ ప్రభుత్వం కేటీఆర్‌పై తప్పుడు కేసు పెట్టిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత జగదీష్‌రెడ్డి ఆరోపించారు. తమ నాయకులపై తప్పుడు కేసులు పెట్టేందుకు ఎన్నో ఎంక్వయిరీలు చేయించారని, అయినా కొండను తవ్వి కనీసం ఎలుకను కూడా పట్టలేదని విమర్శించారు. కేటీఆర్‌పై ఒక చిల్లర కేసు పెట్టారని, తప్పు చేసినట్లయితే శాసనసభలో చర్చ పెట్టాలని డిమాండ్ చేశారు. ఫార్ములా వన్ రేసుపై సమాధానం చెప్పడానికి కేటీఆర్ సిద్ధంగా ఉన్నారని జగదీష్ రెడ్డి చెప్పారు. చర్చ పెట్టకుండా ఎందుకు పారిపోతున్నారని, దమ్ము లేదా..? అని ఆయన ప్రశ్నించారు. రైతు రుణ మాఫీ, మహిళా సమస్యలపై అసెంబ్లీలో చర్చనే లేదని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం ఏడు లక్షల కోట్ల అప్పు చేసిందని తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అప్పు నాలుగు లక్షల కోట్లేనని ఆర్బీఐ స్పష్టం చేసిందని అన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో ఫార్ములా వన్‌పై చర్చ కచ్చితంగా జరగాల్సిందేనని మాజీ మంత్రి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఎన్ని తప్పుడు ప్రచారాలు చేసినా వాస్తవాలు ప్రజలకు తెలుసని అన్నారు. కాంగ్రెస్ ఏడాది కాలంలో 1.2 లక్షల కోట్ల రూపాయల అప్పు చేసిందని, దీన్నిబట్టి వాళ్ళు ఐదేళ్లలో ఏడు లక్షల కోట్ల అప్పు చేస్తారని అన్నారు. అసత్యాలతో బీఆర్ఎస్ పార్టీని బయపెట్టలేరని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్ని కుట్రలు చేసినా, వెధవ వేషాలు వేసినా ప్రజాక్షేత్రంలో, శాసనసభలో నిలదీస్తామని జగదీష్ రెడ్డి అన్నారు. ఫార్ములా వన్‌పై తప్పక అసెంబ్లీలో చర్చ పెట్టాలని డిమాండ్ చేశారు. బీజేపీ, కాంగ్రెస్ ఒక్కటేనని, బడే భాయ్, చోటే భాయ్ ఒకే లైన్‌లో ఉన్నారని ఆరోపించారు.



# చైతన్య డీమ్ డు టు బి యూనివర్సిటీ నుండి ఫార్మసీలో దివ్య లక్ష్మికి పిహెచ్డి పట్టా





**హనుమకొండ ప్రతినిధి, డిసెంబర్ 20 (పిసిడబ్ల్యూ న్యూస్):** చైతన్య డీమ్ డు టు బి యూనివర్సిటీ నుండి ఫార్మసీ లో కానాల దివ్య లక్ష్మికి పిహెచ్డి పట్టా అందుకున్నారు. డాక్టర్ సరిత చుక్క మార్గదర్శకత్వంలో చేసిన పరిశోధనకు గాను ఫార్మలేషన్ అండ్ ఎవల్యూయేసన్ ఆఫ్ బై లేయర్ టాబ్లెట్స్ ఆఫ్ సెలెక్టెడ్ ఆంటీ హైపర్ టిన్సివ్ డ్రగ్స్ అనే అంశంపై ఫార్మసీ లో పిహెచ్డి పట్టా అందుకున్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సి ఎస్ వి పురుషోత్తం రెడ్డి, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ సిహెచ్ సాత్విక రెడ్డి, రీసెర్చ్ డెవలప్మెంట్ డీన్ ప్రొఫైటర్ క్రిస్టఫర్ రూబెన్, రిజిస్టర్ ఆచార్య రవీందర్, ఎగ్జామినేషన్ కంట్రోలర్ ఆచార్య జగదీశ్వర్, ఫార్మసీ డిన్ ఆచార్య పి శంకరయ్య, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్, అసిస్టెంట్ రిజిస్టర్ గాదె రాంబాబు ఈ సందర్భంగా దివ్య లక్ష్మి ని అభినందించారు.

# చదువుతో పాటు ఆటలకు ప్రాధాన్యం ఇవ్వాలి..!

- సంగెం మండల బిసి సంఘం అధ్యక్షులు వేల్పుల అనిల్ యాదవ్
- ముగిసిన చిన్నపాక సుశీలా-యాకయ్య-రాజు స్మారక ఆటల పోటీలు





**సంగెం, డిసెంబర్ 20 (పీసీడబ్ల్యూ న్యూస్):** విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు అంతే ప్రాధాన్యం ఇవ్వాలని బిసి సంక్షేమ సంఘం సంగెం మండల అధ్యక్షులు వేల్పుల అనిల్ యాదవ్ అన్నారు.శుక్రవారం రోజున మండలంలోని తిమ్మాపురం గ్రామంలో క్రీ.శే.చిన్నపాక సుశీల-యాకయ్య,చిన్నపాక రాజు స్మారకార్థం వారి కుటుంబసభ్యులు చిన్నపాక చంద్రకళ-రాములు ఏర్పాటు చేసిన బ్యాడ్మింటన్ షెటిల్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమం నిర్వహించడం జరిగింది.అనంతరం ఈ టోర్నమెంట్ లో విజేతలుగా నిలిచిన మొదటి బహుమతి వేల్పుల అఖిల్ యాదవ్-వర్కాల ప్రదీప్ టిమ్,రెండవ బహుమతి కోల్కనూరి రాజు-బాషబోయిన మణికంఠ టిమ్ ను పూలబొకే ఇచ్చి శాలువాలతో సన్మానం చేసి అభినందించారు.ఈ సందర్భంగా అనిల్ యాదవ్ మాట్లాడుతూ..ప్రతీ విద్యార్థి చదువుతో పాటు క్రీడలకు అంతే ప్రాధాన్యత ఇవ్వాలని అప్పుడే జీవితంలో మరింత ఉన్నత స్థితికి చేరుకోగలుగుతారని అన్నారు.అనంతరం ఈ కార్యక్రమం విజయవంతం కావడం కోసం కృషి చేసిన చిన్నపాక రాకేష్ ను అభినందించారు.ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచులు గన్ను శారద-సంపత్,మాదినెని రాంరెడ్డి,మాజీ ఉపసర్పంచ్ దబ్బేట సారంగపాణి,బిసి నాయకులు దబ్బేట రాజు,నాయకులు,మహిళలు,యువకులు,తదితరులు పాల్గొన్నారు.

# కేటీఆర్‌ను అప్రతిష్టపాలు చేయాలని కాంగ్రెస్ కుట్ర

- కావాలనే బీఆర్ఎస్‌పై బురదజల్లే యత్నం : హరీశ్‌రావు



**హైదరాబాద్,డిసెంబర్ 20 (పీసీడబ్ల్యూ న్యూస్):** కేటీఆర్‌ను అప్రతిష్టపాలు చేసి బీఆర్ఎస్‌ను ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారని సిద్ధిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. అసెంబ్లీ నడిచే సమయంలో ఒక ఎమ్మెల్యేపై అక్రమ కేసు పెట్టారని చెప్పారు. ఫార్ములా-ఈ కార్ రేస్ అంశంలో స్పీకర్ చాంబర్‌లో కలిసి విజ్ఞప్తి చేశామన్నారు. ఫార్ములా-ఈ కార్ రేస్ అంశంలో రకరకాల లీకులు ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. తాము ఎలాంటి తప్పు చేయలేదన్నారు. రాష్ట్ర ఆదాయాన్ని పెంచేందుకు ఫార్ములా-ఈ రేస్ నిర్ణయం తీసుకున్నామన్నారు. తాము తప్పు చేశామంటున్నారని, సభలో చర్చించి అదేదో చెప్పాలని డిమాండ్ చేశారు. తాము చేసింది ఎందుకు తప్పుకాదో ఈ సభ ద్వారా మేం కూడా ప్రజలకు చెబుతాం. మీరు పెట్టింది అక్రమ కేసు కాకుంటే ఈ సభలో చర్చించాలన్నారు. తాము తప్పు చేయలేదని.. రాష్ట్రం కోసం చేశామని కేటీఆర్ చెప్పారన్నారు. అక్రమ కేసు పెట్టినప్పుడు కేటీఆర్‌కు చెప్పుకునే అవకాశం ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ 420 హామీలపై నిలదీస్తున్నందుకు, లగచర్ల రైతుల తరఫున పోరాటం చేస్తున్నందుకు కేటీఆర్‌పై కేసు పెట్టారని విమర్శించారు. ఈ క్రమంలో సభ సజావుగా నడిచేందుకు సహకరించాలని స్పీకర్ విజ్ఞప్తి చేశారు. అయితే ఫార్ములా-ఈ రేస్ విషయంలో స్పష్టమైన హామీ ఇస్తే సహకరిస్తామని హరీశ్ రావు స్పష్టం చేశారు. అది ఒక సభ్యుడికి సంబంధించ అంశమని, ముందు బిల్లులపై చర్చిద్దామని స్పీకర్ అన్నారు. అందుకు ఒప్పుకోని బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఫార్ములా-ఈ కార్ రేస్‌పై చర్చకు పట్టుపట్టారు. భూ భారతి బిల్లుపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చర్చను ప్రారంభించడంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు స్పీకర్ పోడియం ముందు ఆందోళనకు దిగారు. ఈ నేపథ్యంలో సభను స్పీకర్ వాయిదా వేశారు.

# ఆసిరెడ్డిపల్లి అమ్మ గార్డెన్‌లో నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ జడ్పిటిసి



**టేకుమట్ల, డిసెంబర్ 20 (పీసీడబ్ల్యూ న్యూస్):** టేకుమట్ల మండలం పంగిడి పల్లి గ్రామానికి చెందిన బీన వేణి లక్ష్మి, ( కీర్తిశేషులు సమ్మయ్య గౌడ్ ) కూతురు దీపిక వెడ్స్ దిలీప్ లా వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన టేకుమట్ల మాజీ జెడ్పిటిసి పులి తిరుపతి రెడ్డి ఈ కార్యక్రమంలో భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి తిప్పిరెడ్డి కృష్ణారెడ్డి మరియు మాదాసి మహేందర్ భీనవేని వేని శ్రీనివాస్ తాళ్లపల్లి తిరుపతి అరెల్లి శంకర్ బండ రఘుపతి బుర్ర శంకర్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

# కేసులు ఉపసంహరించుకునే వరకూ పోరాడుతాం : మధుసూదనాచారి

**హైదరాబాద్,డిసెంబర్ 20 (పీసీడబ్ల్యూ న్యూస్):** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై పెట్టిన అక్రమ కేసును ఉపసంహరించుకునే వరకు పోరాడుతామని మండలిలో విపక్ష నేత, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ మధుసూదనాచారి అన్నారు. కేటీఆర్ మీద పెట్టిన అక్రమ కేసు తీవ్రంగా నిరసన తెలుపుతున్నామని, దానిపై సభలో చర్చించాలని డిమాండ్ చేశామన్నారు. హైదరాబాద్ విశ్వనగరంగా తీర్చిదిద్దేందుకు కేసీఆర్ అనేక కార్యక్రమాలు చేపట్టారని, కేటీఆర్ తన శక్తి మేరకు ప్రపంచ స్థాయి ఫార్ములా-ఈ రేస్ హైదరాబాద్ తెచ్చారని వెల్లడించారు. శాసనమండలి మీడియా పాయింట్ వద్ద ఎమ్మెల్సీలు మహమూద్ అలీ, సత్యవతి రాథోడ్ కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో విదేశీ పెట్టుబడులు పెట్టేలా ఈ రేస్ చేపట్టారన్నారు. మొదటి రేసు విజయవంతమైందని, రెండో రేసుని ప్రభుత్వం ఆపేసిందని చెప్పారు. హైదరాబాద్‌ను సర్వనాశనం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని విమర్శించారు. అందులో భాగంగానే కేటీఆర్‌పై అక్రమ కేసు పెట్టారని ఆరోపించారు. ఇప్పటికే కేటీఆర్ అన్ని వివరాలు చెప్పారని, ఇందులో ఎలాంటి అవినీతి జరగలేదని స్పష్టం చేశారు. చాలా పారదర్శకంగా చెల్లింపులు జరిగాయని వెల్లడించారు. ప్రభుత్వం తప్పులను ఎత్తి చూపుతునందుకే ఈ అక్రమ కేసు పెట్టారని విమర్శించారు. రాష్ట్రంలో భయానక వాతావరణం కొనసాగుతున్నదని, అప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ బిడ్డలకు పోరాటాలు కొత్తకాదని చెప్పారు. ఎలాంటి కేసులైన ధైర్యంగా ఎదుర్కొంటారని స్పష్టం చేశారు. కేటీఆర్‌ప పెట్టిన కేసు అక్రమమని మాజీ మంత్రి మహమూద్ అలీ అన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఈ రేస్ తెచ్చారని తెలిపారు. అనుకున్న దానికంటే ఎక్కువ పెట్టుబడులు వచ్చాయని వెల్లడించారు. హైదరాబాద్ ఇమేజ్ మరింత పెంచేందుకు ఫార్ములా-ఈ రేస్ తెచ్చారని చెప్పారు. కేటీఆర్ మీద కేసులు పెట్టడం కాదని, ఇచ్చిన హామీలు నెరవేర్చాలని రేవంత్ రెడ్డికి సూచించారు.

# రాజస్తాన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

- గ్యాస్ ట్యాంకర్‌ను ట్రక్కు ఢీకొనడంతో పేలుడు
- 11 మంది సజీవ దహనం..
- అగ్నికి ఆహుతి అయిన 40 వాహనాలు

**జైపూర్,డిసెంబర్ 20 (పీసీడబ్ల్యూ న్యూస్):** రాజస్తాన్ లోని జైపూర్ నుంచి అజ్మీర్ వెళ్లే హైవేపై శుక్రవారం ఉదయం ఘోర ప్రమదం జరిగింది. ఉదయం 6 గంటల సమయం కావడంతో రద్దీ తక్కువగా ఉంది. వాతావరణం చల్లగా ఉన్నప్పటికీ, ఒక్కసారిగా కిలోమీటరు మేర మంటలు చెలరేగాయి. అక్కడ ఏమి జరిగిందో అర్థం అయ్యే సరికే మంటలు చాలా వాహనాలకు వ్యాపించాయి. అంతేకాదు ఆ మంటలు రోడ్డు పక్కన ఉన్న ఫ్యాక్టరీని చుట్టుముట్టాయి. కొద్దిసేపటికే చుట్టుపక్కల ప్రాంతాల్లో హాహాకార కేకలు మిన్నంటాయి. ఏం జరిగిందో జనాలకు అర్థమయ్యే సరికే ఆ ప్రాంతమంతా అగ్నిగుండంగా మారింది. కార్లలో కూర్చున్న వారు క్షణాల్లోనే దగ్ధం అయ్యారు. క్రమంగా హైవేపై వెళ్లే వాహనాలకు ఈ అగ్ని వ్యాపించింది. అసలు మంటలు ఎలా చెలరేగాయి అనే ప్రశ్నకు సమాధానం తెలుసుకునేలోపే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. అందరు తమ ప్రాణాలు కాపాడుకునే పనిలో పడ్డారు. ఎలాగోలా పోలీసు అడ్మినిస్ట్రేషన్ కు ఈ ప్రమాదం గురించి సమాచారం అందించారు. రంగంలోకి దిగన సిబ్బంది వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. ఈ ఘోర ప్రమాదంలో ఇప్పటి వరకు 11 మంది చనిపోయారు. వాస్తవానికి జైపూర్-అజ్మీర్ హైవేపై ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ముందు.. %ఖ్రా+% నింపిన ట్యాంకర్ అజ్మీర్ నుంచి జైపూర్ వైపు వస్తోంది. ట్యాంకర్ యూ టర్న్ తీసుకుంది. కొన్ని వాహనాలు నిలిచి దారి కోసం చూస్తున్నాయి. ఇంతలో జైపూర్ నుంచి లోడ్‌తో కూడిన లారీ వస్తూ ట్యాంకర్‌ను ఢీకొట్టింది. లారీ ఢీకొనడం వల్ల ట్యాంకర్ నుంచి గ్యాస్ లీకైంది. గ్యాస్ ద్రవ రూపంలో లీక్ కావడంతో మంటలు చెలరేగాయి. గ్యాస్ వేగంగా వ్యాపించడంతో మంటలు కూడా అంతే వేగంగా వ్యాపించి చుట్టుపక్కల ప్రాంతమంతా మంటలు చుట్టుముట్టాయి.